

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు!

- వెలిగొండను పూర్తి చేయడమే మా లక్ష్యం
- నిర్దేశిత గడువులోపు ఎలా పనిచేయాలో చూడండి
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల ఆదేశం
- సమీక్షలతో అధికారుల ఉరుకులు పరుగులు
- ఇద్దరు వీఆర్వోలపై చర్యలకు సూచన
- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన రామానాయుడు

త్రిపురాంతకం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 'మొద్దు నిద్ర వీడండి. గత ప్రభుత్వంలో పనిచేస్తున్నామనే భ్రమ నుంచి బయటకు రండి. నిర్దేశిత లక్ష్యంలోపు వెలిగొండ పనులను పూర్తి చేయండి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులైనా, పనులు చేసే ఏజెన్సీలపైన అయినా వేటు తప్పదు' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈనెల 7వతేదీన ఒకసారి ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి.. అధికారులకు కొన్ని సూచనలు చేసి వెళ్లారు. ముఖ్యంగా వెలిగొండ ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చడం, టన్నెళ్లలోని నీటిని బయటకు పంపే పనులకు నిర్దేశిత గడువును అధికారుల నుంచే తీసుకొన్నారు. మళ్లీ వస్తానని ఆ సందర్భంగా చెప్పి వెళ్లారు. నాలుగురోజుల వ్యవధిలో మళ్లీ మంత్రి వస్తారని ఊహించలేదేమో కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మంత్రి వస్తున్న సమాచారంతో పనులు చేసేందుకు యంత్రాలను తెచ్చి ఉంచడాన్ని ఆయన గమనించారు. ప్రాజెక్టు పనుల పరిశీలన, సమీక్ష సందర్భంగా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నెళ్లలోకి వచ్చిన నీటిని తోడేందుకు కూడా ప్రణాళిక లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. నేను వేరే జిల్లాలో ఉండి కూడా ఇక్కడ పనుల ఫొటోలను తెప్పించుకుని చూశానని, ప్రాజెక్ట్ పట్ల తాము ఎంత శ్రద్ధతో పనిచేస్తున్నామో గ్రహించాలన్నారు. అత్యంత


కలెక్టర్ రాజాబాబుతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

మిగతా 6వ పేజీలో


వెలిగొండ సొరంగం వద్ద వరద నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ఆంధ్రజ్యోతి పరిశీలన

పని పర్యవేక్షణ లేదు!

అస్తవ్యస్తంగా సచివాలయాలు


మర్రాపురంలోని 19వ సచివాలయంలో ఉదయం 11.00 గంటలకు కూడా సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు


ఉప్పుగుండూరు-1 సచివాలయంలో ఉదయం 11 గంటలు దాటినా రాని ఉద్యోగులు


తలుపులు తెరుచుకోని చీమకుర్తిలోని గాంధీనగర్ సచివాలయం

- సిబ్బంది ఎక్కువ.. పని తక్కువ
- ఎవరు ఏ పనిచేస్తున్నారో తెలియదు
- ప్రభుత్వ సర్వేలన్నీ వారిపైనే.. ఆ పేరు చెప్పి కార్యక్రమాలకు దూరం
- కనిపించని సమయపాలన
- ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా పనితీరు


దర్శి-1 సచివాలయంలో సిబ్బంది రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రజా ప్రభుత్వం లోటుపాట్లను సరిచేస్తూ మూడు కేటగిరీల్లోకి తెచ్చి సిబ్బందిని సర్దుబాటు చేసినా గాడిన పడలేదు. ఎవరు ఏ పని చేస్తున్నారో, ఏ పని మీద ఎక్కడికి వెళ్లారో, తిరిగి ఎప్పుడు కార్యాలయానికి వస్తారో తెలియని పరిస్థితి. అడ్మిన్ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్ వంటి వారికి ఏదో ఒక పని ఉంటున్నప్పటికీ మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంటి వారు నామమాత్రమే అయ్యారు. ఇతరులలో వ్యవసాయ, వెటర్నరీ, సర్వే అసిస్టెంట్లకు పరిమితంగా పనులు ఉంటున్నాయి. మొత్తంగా ఎక్కువ మందికి పనితోపాటు వారిపై పర్యవేక్షణ కూడా తక్కువగానే ఉంది. అదేసమయంలో సర్వేల పేరుతో జిల్లా యంత్రాంగం కూడా సచివాలయ సిబ్బందిని గందరగోళ పరుస్తోంది. కొందరు ఆ సాకు చూపి కార్యాలయాలకు దూరంగా ఉంటున్నారు. అత్యధిక శాతం సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎక్కువ చోట్ల ఇద్దరు, ముగ్గురు మించి కనిపించకపోవడం అందుకు నిదర్శనం.

ఒంగోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ వ్యవస్థ అంతా గందరగోళం, అస్తవ్యస్తంగా ఉంది. పని తక్కువ, సిబ్బంది ఎక్కువ అన్నట్లు పరిస్థితి తయారైంది. వీరిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కొందరు సిబ్బందికి పనిభారం ఉంటే మరికొందరికి కనీస పని కూడా ఉండని స్థితి. జిల్లాలోని సచివాలయాల పనితీరుపై ఆంధ్రజ్యోతి బృందం పరిశీలన చేసింది. అత్యధిక శాతం సచివాలయాల్లో అరకొర సిబ్బంది మాత్రమే కనిపించారు. అంతా గందరగోళంగా ఉన్న విషయం స్పష్టమైంది. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. కొత్త వ్యవస్థను తెచ్చామని ఆర్భాటపు ప్రచారం తప్ప అవి సజావుగా నడిచేలా అవసరమైన ఏర్పాట్లు చేయలేదు. పర్యవేక్షణ సక్రమంగా ఉండేలా నిబంధనలు, సిబ్బందికి శిక్షణ, వారిలో జవాబుదారీతనం ఉండే చర్యలు

మిగతా 6వ పేజీలో

మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు

7

- ఎనిమిది బైక్‌లు, ఏడు గొర్రెలు స్వాధీనం
- దొనకొండ అడ్డరోడ్డు వద్ద పట్టుకున్న పోలీసులు
- నిందితులు ఎనిమిది మందిలో ముగ్గురు పాతనేరస్థులు
- వివరాలను వెల్లడించిన త్రిపురాంతకం సీఐ అస్సాన్


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

సమగ్రశిక్ష ఉద్యోగుల పోరుబాట

- 24న కలెక్టరేట్ ఎదుట దీక్ష

వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా వివేకానంద

రేపటి నుంచి సహకార వారోత్సవాలు

వివరాలు 7లో

పాఠశాలల్లో తనిఖీలు

50 స్కూళ్లలో సోషల్ ఆడిట్

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఏటా 20శాతం పాఠశాలల చొప్పున ఐదేళ్లలో వంద శాతం ఆడిట్‌ను పూర్తిచేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 50 పాఠశాలలను సోషల్ ఆడిట్‌కు ఎంపిక చేశారు. తనిఖీల కోసం 29మంది డీఆర్పీలు, ఇద్దరు ఎస్ఆర్వోలు కలిపి 31మందిని నియమించారు. ఈనెల 10 నుంచి సోషల్ ఆడిట్ మొదలు కావాల్సి ఉండగా ఆర్పీలు మంగళవారం నుంచి ప్రారంభించారు. మంగళ, బుధవారాల్లో 29 పాఠశాలల్లో పూర్తిచేశారు. గురు, శుక్రవారాల్లో మిగిలిన 21 స్కూళ్లలో తనిఖీలను చేయనున్నారు. సోషల్ ఆడిట్‌లో పుస్తకాలు, యూనిఫాం, క్రీడా పరికరాలన్నింటినీ పరిశీలించారు. ఆయా అంశాలను అప్పటికప్పుడే యాప్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఉపాధ్యాయులు

మిగతా 6వ పేజీలో

ఒంగోలులో గృహ యజమానికి నమూనా తాళాన్ని అందిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే జనార్దన్



ఇళ్ల పండుగ

- వైభవంగా గృహప్రవేశాలు, భూమిపూజ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఒంగోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం పక్కా గృహ ప్రవేశాలు, భూమిపూజ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదేశాలతో ప్రజాప్రతినిధులు, వివిధ స్థాయిల్లోని అధికారులు పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా అనేక చోట్ల గృహప్రవేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రప్రభుత్వ భాగస్వామ్య పథకాల ద్వారా మూడు లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటన్నింటికీ ఒకేరోజున బుధవారం గృహప్రవేశ

మిగతా 6వ పేజీలో


వగ్గంపల్లి ఎస్సీ కాలనీలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

పంచాయతీలు ప్రక్షాళన

- గ్రామాల్లో నిరంతరాయంగా సేవలు
- నాలుగు విభాగాలుగా పాలన
- ప్రత్యేక ఐటీ వింగ్
- మునిసిపాలిటీల తరహాలో చర్యలు



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామపంచాయతీల ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక నుంచి పల్లెప్రజలకు మునిసిపాలిటీల తరహాలో నిరంతరం సేవలు అందనున్నాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం జారీ చేసింది. తద్వారా ప్రజలకు సేవలు వేగవంతంగా అందడంతోపాటు పారదర్శకత పెరగనుంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా పనిచేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దుచేసి పంచాయతీలను స్వతంత్రంగా ఏర్పాటు చేశారు. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిని ఆదాయం, జనాభా ఆధారంగా విభజించారు. ప్రస్తుతం ఐదు గ్రేడ్‌ల వారు పంచాయతీ కార్యదర్శులుగా వ్యవహరిస్తుండగా, గ్రేడ్-6

మిగతా 6వ పేజీలో

పని లేదు.. పర్యవేక్షణ లేదు!

(5వ పేజీ తరువాయి)

చేపట్టలేదు. రాజకీయ అవసరాల కోసం వలంటీర్ల వ్యవస్థను తెచ్చి సచివాలయాలకు అనుసంధానం చేయడంతో ప్రజల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేపట్టింది.

మూడు కేటగిరీలు చేసి సర్దుబాటు

జనాభా ప్రాతిపదికన సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించి ఒక్కో దానికి స్థాయిని బట్టి సిబ్బందిని సర్దుబాటు చేశారు. సవరించిన దాని ప్రకారం జిల్లాలో 2,500లోపు జనాభా ఉండే సచివాలయాలు 201 ఉండగా, 2,500 నుంచి 3,500 జనాభా ఉండే సచివాలయాలు 219, అంతకన్నా అధికంగా ఉండే సీ కేటగిరీ సచివాలయాలు 299 కలిపి మొత్తం 719 ఉన్నాయి. వాటిలో మొత్తం 6,122 మంది సిబ్బంది పని చేస్తున్నారు. కొన్ని ఖాళీలు ఉన్నాయి. ఏ కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు, బీ కేటగిరిలో 8 మంది, సీ కేటగిరిలో పది మంది సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేశారు. అయితే అన్ని సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీ, మహిళా పోలీస్, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ సెక్రటరీ, హెల్త్ అసిస్టెంట్ ఉంటుండగా పట్టణాల్లో శానిటేషన్, ప్లానింగ్ వంటి వారు గ్రామాల్లో వ్యవసాయ, విలేజ్ సర్వేయర్, వెటర్నరీ, ఎనర్జీ అసిస్టెంట్లు ఉంటున్నారు. అయితే ఆయా సచివాలయాల్లోని సిబ్బంది అడ్మిషన్ సెక్రటరీ, డిజిల్ అసిస్టెంట్, వీఆర్వో, హెల్త్ వంటి వారికి ఏదో ఒక పని ఉంటున్నా మిగతా సిబ్బందిలో ఎక్కువ మంది రోజువారీ సరిపడా పని కనిపించడం లేదు.

చాలామంది ఖాళీగానే..

మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దాదాపు ఖాళీగా ఉంటున్నారు. గ్రామాల్లో వ్యవసాయ, వెటర్నరీ, విద్యుత్, విలేజ్ సర్వేయర్ వంటి వారికి అప్పుడప్పుడూ పని ఉంటోంది. పట్టణాల్లో శానిటేషన్ ఇతర సిబ్బందికి పరిమితంగా పనులు ఉంటున్నాయి. దీంతో ఎక్కువ శాతం సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదు. ఇదే విషయం ఆంధ్రజ్యోతి బృందం పరిశీలన సందర్భంగా కనిపించింది. అనేక సచివాలయాలు అధ్వానంగా పనిచేస్తున్న తీరు బహిర్గతమైంది. చాలాచోట్ల సకాలంలో సచివాలయాలు తలుపులు కూడా తెరుచుకో లేదు. మధ్యాహ్నం వరకు కూడా కొన్నింటిలో ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే కనిపించారు. మిగతా వారి గురించి అడిగినా ఉన్న సిబ్బంది సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సర్వేల పేరుతో గైర్హాజరు..

ఎవరు ఎక్కడికి వెళ్తున్నారో ఎప్పుడు తిరిగి వస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి సచివాలయాల్లో నెలకొంది. ఎక్కువ మంది సిబ్బంది సర్వేలు, ఇతర శాఖల పనులకు డిప్యుటేషన్లు పేరు చెప్పి సచివాలయాలకు సక్రమంగా హాజరు కావడం లేదు. ప్రభుత్వం కూడా ఏ శాఖకు సంబంధించిన పని అత్యవసరమైతే దానికి, ఏ సర్వేకి అవసరమైతే ఆ సర్వేలకు సచివాలయ సిబ్బందిని వాడుకొంటోంది. జిల్లా అధికారులు కూడా ఆ వ్యవస్థను మరింత గందరగోళం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక దాదాపు పది రకాల సర్వేలతోపాటు పలువురు సిబ్బందిని ఓటర్ల సవరణ కోసం బీఎల్వోలుగా నియమించింది. మొత్తంగా చూస్తే జిల్లాలో సచివాలయాల పనితీరు ప్రస్తుత ప్రభుత్వంలోనూ అవసరమైన మేర మెరుగుపడకుండా అస్తవ్యస్తంగానే సాగుతోంది.

పంచాయతీలు ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. జిల్లాలో 38 మండలాలు ఉండగా వాటి పరిధిలో అధికంగా ఆదాయం ఉన్న 11 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. గ్రేడ్-1 పంచాయతీలు 75, గ్రేడ్-2 పంచాయతీలు 265, గ్రేడ్-3 పంచాయతీలు 373, జనాభా 500లోపు ఉన్న గ్రామ పంచాయతీలు ఐదు ఉన్నాయి. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నియమించనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీవో)గా పిలవనున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లకు సీనియారిటీని బట్టి ఉద్యోగోన్నతులు కల్పించి వారిని పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తారు.

ప్రజలకు సత్వర సేవలు

మునిసిపాలిటీల తరహాలోనే గ్రామ పంచాయతీల్లో పలు విభాగాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలను ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా సేవలు అందించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో విధానంలో సిబ్బందిని నియమించనుంది. వారికి పంచాయతీ నిధుల నుంచే జీతాలు చెల్లిస్తారు. ప్రస్తుతం పంచాయతీల్లో అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఇక నుంచి పంచాయతీల్లో ప్లానింగ్ అసిస్టెంట్లుగా వ్యవహరిస్తారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్ రూల్స్‌ను అమలుచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని ఏర్పాటుచేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హతలు ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకుంటారు. రికార్డులను డిజిటలైజేషన్ చేసి గ్రామపంచాయతీల్లో రియల్ టైంలో ప్రజలకు సర్వీసులు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.



ప్రమాణం చేస్తున్న గ్రామ, క్లస్టర్, బూత్, వార్డు కమిటీ సభ్యులు



టీడీపీ ఆరు మండలాల అధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

స్థానిక సంస్థల్లో వంద శాతం
విజయం సాధించాలి

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య
- టీడీపీ మండల కమిటీల ప్రమాణ స్వీకారం

కొండపి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల, గ్రామ, వార్డు, బూత్‌లెవల్ కమిటీలు సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం స్థానాల్లో పార్టీ మద్దతుదారులు విజయం సాధించేలా కృషి చేయాలని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పిలుపునిచ్చారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని ఓ కల్యాణమండపంలో బుధవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, గ్రామ, వార్డు, బూత్ లెవల్ కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సత్య మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తాము అండగా ఉంటున్నామని చెప్పారు. కొందరికి పదవులు వచ్చాయని, మరికొందరికి రానున్న రోజుల్లో వస్తాయన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తనతోపాటు మంత్రి స్వామి, తన తండ్రి పూర్ణచంద్రరావు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. ఎవరివద్దకైనా వచ్చి సమస్య చెప్పి పరిష్కరించుకోవచ్చన్నారు. కొంతమంది స్వప్రయోజనాల కోసం సామాజిక మాధ్యమాల్లో పిచ్చిపిచ్చి పోస్టులు పెడుతున్నారని అన్నారు. అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉండి వారికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా ఆరు మండలాల కమిటీ అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, అనుమోలు సాంబశివరావు, చదలవాడ చంద్రశేఖర్, పోకూరి రవీంద్రబాబు, మించల బ్రహ్మయ్య, గొపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మిగతా కమిటీల సభ్యులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, నాయకులు బెల్లం జయంత్‌బాబు, పోటు శ్రీనివాసమురళి, యర్రమోతు శ్రీనివాసులు, బత్తుల నారాయణస్వామి, మాజీ ఎంపీపీలు దాసరి వెంకటేశ్వర్లు, పేముల విజయనిర్మల, ఎస్సీసెల్ నాయకుడు బ్రహ్మానందం, సంధాని బాషా, కొండపి సర్పంచ్ కొమ్ము సుశీల పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ

పీసీపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో మండలంలోని వెంగళాయపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21న విజయవాడలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ప్రభుత్వ ఉద్యోగుల తరపున ఉపాధ్యాయుడు రమణయ్య క్రీడాపోటీల్లో పాల్గొననున్నారు.

ఎంఈవోగా మాలకొండయ్య బాధ్యతలు స్వీకరణ

దర్శి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దర్శి నూతన ఎంఈవోగా కె. మాలకొండయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎంఈవో రఘురామయ్య ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నియమితులైన మాలకొండయ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందేవిధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కనిగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14వ తేదీ నుంచి (రేపటి నుంచి) జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు గ్రంథపాలకుడు షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 15వ తేదీన పుస్తక ప్రదర్శన, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమకారులు గురించి అవగాహన, 17న కవి సమ్మేళనం, 18 న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. 19వ తేదీన మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు, 20వ తేదీన ముగింపు వేడుకల నిర్వహించటంతో పాటు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని ఆప్రకటనలో పేర్కొన్నారు.

13 మందికి జరిమానా

దర్శి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13మందికి దర్శి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె. నిఖిత ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. దర్శిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మంది వ్యక్తులను దర్శి ఎస్‌ఐ ఎం. మురళీ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా ఈ మేరకు జరిమానా విధించారు.

సెమీస్‌కు చేరిన జట్టు

గిద్దలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్, హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్‌తో కలిసి నర్సాపురంలో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో పాల్గొని సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 230 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 65 ఏళ్ల విభాగంలో కంచర్ల కోటయ్యగౌడ్, చంద్రశేఖర్‌లు భాస్కర్‌రాజు, రమేష్‌బాబును 9-5 స్కోరు తేడాతో ఓడించి విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

పల్లామల్లిలో ఇత్తడి కాగులు చోరీ

చీమకుర్తి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లామల్లి గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ ఒంటరి మహిళ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. కుంచాల వెంకటమ్మ బుధవారం కూలి పనులు ముగించుకొని ఇంటికి వచ్చింది. తన ఇంటి తాళాలు పగలకొట్టినట్లు కనపడింది. ఇంట్లోకి వెళ్లి చూస్తే నాలుగు ఇత్తడి కాగులు దొంగతనానికి గురైనట్లు గుర్తించి బయటకు వచ్చి అందరి వద్ద లబోదిబోమని వాపోయింది.

అరటి తోటలో కొండచిలువ

రాచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల గ్రామానికి చెందిన బొడ్డు వెంకట సుబ్బారెడ్డి అరటి తోటలో బుధవారం కొండచిలువ కనిపించింది. రైతు తన పొలంలోనికి వెళ్లి పంటను పరిశీలిస్తుండగా కొండ చిలువ కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకొని సమీప అటవీ ప్రాంతంలోనికి తీసుకువెళ్లి వదిలివేశారు.

పేదల సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం కృషి

- కలెక్టర్ రాజాబాబు
- ఎమ్మెల్యే దామచర్లతో కలిసి నూతన గృహాల ప్రారంభం
- కొత్తగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు



ఒంగోలులోని కేశవరాజుకుంటలో నూతన ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు నగరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం కేశవరాజుకుంటలో గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7372 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, రూ.17.77 కోట్ల ప్రయోజనం లబ్ధిదారులకు ఒనగూరిందన్నారు. వివిధ దశల్లో 11,443 గృహాలు ఉన్నాయని చెప్పారు. గతంలో రూ.1.80 లక్షల యూనిట్ విలువ ఉండగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ప్రస్తుతం యూనిట్ విలువను రూ.2.50 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. గతంలో ఇళ్ళు మంజూరైన వారికి కూడా పెరిగిన యూనిట్ విలువను అమలు చేస్తున్నామని, అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, చెంచు కుటుంబాలకు మరింత అదనపు ప్రయోజనం ప్రభుత్వం కలుగజేస్తుందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒంగోలు నియోజన వర్గంలో 400ల పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణాల వలన లబ్ధిదారులకు రూ.95 లక్షల ప్రయోజనం కలిగిందన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ నిర్మాణాల వల్ల 721 కుటుంబాలకు రూ.1.86 కోట్ల ప్రయోజనం చేకూరిందని తెలిపారు. కేశవరాజుకుంటలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు!

(5వ పేజీ తరువాయి)

వెనుకబడిన ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం వెలిగొండ పూర్తితోనే సాధ్యమవుతుందన్నారు. వరద నీరు ఎక్కువై సమీప పొలాలపైకి వచ్చి పాడైపోతే నేటికీ అధికారులు ఎందుకు స్పందించలేదని నిలదీశారు.

వ్యంగ్యాస్త్రాలు.. హెచ్చరికలు

మంత్రి నిమ్మల తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూనే అధికారులకు హెచ్చరికలు చేశారు. సమీక్షకు అధికారులు మాత్రమే ఉండాలని ప్రజలు, ప్రెస్ వద్దని నిర్వహణ బాధ్యతను చూసే అధికారి బయటకు పంపుతుండగా మంత్రి వారించారు. మాది ప్రజాప్రభుత్వమని, పరదాలు, బారికేడ్లతో పాలన చేయమని అందరినీ లోపలకు ఆహ్వానించి ప్రజల మధ్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో నుంచి ఒకరు ఏదో సమస్యను అడుగుతుండగా ముందు మీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేని గెలిపించే బాధ్యత తీసుకోండని సున్నితంగా చెప్పారు. ఎర్రగొండపాలెం ప్రాంతంలో అభివృద్ధి మేము చేస్తాం, ఓట్లు ఇతరులకు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అలాగే అధికారులతో మాట్లాడుతూ మనకు ఉన్న సమయం తక్కువ అని 2026లో వెలిగొండ నీళ్ల ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఇక 20-20 క్రికెట్ మ్యాచ్‌లాగా పనిచేయాలని, 50ఓవర్ల మ్యాచ్‌లాగా ఆడే ఆట కాదన్నారు. అలాగని చివరి ఓవర్లో ఆడదామని గడువు ముగిసే దాక ఆగితే అప్పుడు గెలవడం కష్టమని గుర్తించాలన్నారు. మళ్లీ నెలరోజుల వ్యవధిలోనే వచ్చి సమీక్షిస్తానని ఆ సమయంలో ఎవరి పనితీరు ఏంటో ఆరోజు తెలుస్తుందని హెచ్చరించారు.

వీఆర్వోలపై చర్యలు తీసుకోండి

దోర్నాల మండలంలోని ఐనముక్కల, యడవల్లి వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబును మంత్రి ఆదేశించారు. మొంథా తుఫాన్ సమయంలో వెలిగొండ టన్నెళ్ల నుంచి, తీగలేరు ప్రవాహానికి పలువురు రైతుల భూముల్లో పంటలు దెబ్బతిని, పొలాల్లో మట్టి మెరకలు వేసి నష్టపోయారన్నారు. గతంలో తాను వచ్చినప్పుడు చెప్పిన రైతులే ఈ రోజు కూడా వచ్చారన్నారు. కనీసం తాను వచ్చిన సమయంలో సమాచారం ఇచ్చేందుకు వీఆర్వోలు అందుబాటులో లేరని కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో చెప్పారు. వారికి మెమో ఇచ్చి సరైన సమాధానం లేకపోతే సస్పెండ్ చేయాలని సూచించారు. దోర్నాల పరిధిలో కొందరి స్తంభాలు పడిపోవడం, కొంతమంది పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయకపోవడాన్ని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై నిమ్మల తీవ్రంగా స్పందించారు. అధికారులకు ఆ మాత్రం బాధ్యత లేకుంటే ఎలా అన్నారు. తుఫాన్ పోయిన తరువాత వెంటనే పట్టణాలకు, గృహ అవసరాలకువిద్యుత్ ఇస్తారని, మరి రైతులకు ఎందుకు ఇంకా ఇవ్వడంలేదని అన్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులతోపాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లారు.

వెలిగొండ పూర్తి ధ్యేయంగా సీఎం కృషి : ఎమ్మెల్యేలు

వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం సీఎం చంద్రబాబు ఆలోచనతో ఉండి మంత్రి ద్వారా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారని గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి అన్నారు. సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెలిగొండకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, దానిని పూర్తి చేసి ప్రారంభించే బాధ్యత ఆయనే తీసుకున్నారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పని చేయాలనే సంకల్పంతో సీఎం ఉన్నారని అన్నారు.

జాతికి అంకితం ఎలా చేశారు : ఎరిక్షన్‌బాబు

వెలిగొండ పూర్తి చేయకుండానే ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూ గత వైసీపీ పాలకులు ప్రాజెక్టును జాతికి ఎలా అంకితం చేశారని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఎద్దేవా చేశారు. ఆరోజు చప్పట్లు కొట్టిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇప్పుడు వెలిగొండకు నిధులు ఇవ్వండని అడగడం చూసి ప్రజలు నవ్వుతున్నారని అన్నారు. ప్రజలకు మన ప్రభుత్వంపై నమ్మకం ఉందని, ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుందనే విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీఈ శ్యాం ప్రసాద్, ఇరిగేషన్ అడ్వయిజర్ వెంకటేశ్వరరావు, ఎస్ఈ అబూత్‌అలీ, మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పండుగ

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాగే వివిధ దశల్లో నిర్మాణాలు జరిగిన ఇళ్లకు బిల్లుల చెల్లింపు, కొత్త వాటి నిర్మాణాలకు భూమి పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా దేవగుడిపల్లిలో నిర్వహించగా తదనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలో మొత్తం ఈ 17నెలల కాలంలో రూ.17.77 కోట్ల విలువైన 7,372 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. వాటి ప్రారంభాలతోపాటు వివిధ దశల్లో నిర్మాణాలు జరిగిన 11,443 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు రూ.18.36 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. కొన్నిచోట్ల కొత్తగా నిర్మాణాలకు భూమిపూజలతోపాటు కొందరు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో..

ఒంగోలు నగరపరిధిలోని కేశవరాజుకుంటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు పాల్గొన్నారు. సంతనూతలపాడు మండలం మంగమూరులో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ హాజరయ్యారు. పామూరు మండలం వగ్గంపల్లెలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గృహాలను ప్రారంభించారు. మార్కాపురం పట్టణంలోని 15వ వార్డులో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు పట్టణంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. దర్శి మండలం కొత్తపల్లిలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పెద్దారవీడు మండలం ప్రగళ్లపాడులో వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. ఇతర ప్రాంతాల్లో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి గృహ నిర్మాణ రంగంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఇళ్లు, స్థలాలను ప్రత్యేకంగా అలంకరించి ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పాఠశాలల్లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

సమయపాలన పాటిస్తున్నారా, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై ప్రశ్నించి వివరాలను రాబట్టారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన చిక్కీలను కూడా ఆర్పీలు లెక్కించారు. అక్కడ ఉన్న స్టాక్‌ను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పాఠశాలల రికార్డులన్నింటిని పరిశీలించారు. ఒంగోలు నగరంలో మూడు పాఠశాలలకు సంబంధించిన సోషల్ ఆడిట్ బుధవారం ముగిసింది.

ఇసుక లారీ యజమాని
ఆత్మహత్యాయత్నం

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇసుక లారీకి చలానా వేసి, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయమై ఆ లారీ ఓనర్ ఆత్మాహత్యాయత్నం చేసుకున్న ఘటన బుధవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగింది. పోలీసులు తెలిసిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన లారీ యజమాని యాకోబు నాలుగు రోజుల కిందట అమరావతి నుంచి ఇసుకను ఎర్రగొండపాలెం తీసుకొచ్చారు. ఈ క్రమంలో అధిక లోడుతో వచ్చిన లారీని అధికారులు నిలిపేసి చలానా విధించారు. అది కట్టకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాలుగు రోజులుగా అధికారులు ఇసుక అక్రమార్కులు తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ పెట్రోల్ బాటిల్ తీసుకుని కుటుంబ సభ్యులతో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ అజయ్‌కుమార్ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పి పంపించారు. దీనిపై సీఐని వివరణ కోరగా.. అధిక లోడుతో ఉన్న లారీకి చలానా వేశామని, అంత డబ్బు కట్టుకోలేనని చెప్పడంతో మైనింగ్ అధికారులతో మాట్లాడతామని చెప్పినట్లు తెలిపారు.

సీఆర్పీల ద్వారా ప్రశ్నపత్రాలు

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఏకోపాధ్యాయ పాఠశాలలకు సీఆర్పీల ద్వారా ప్రశ్నపత్రాలను పాఠశాలలకు అందజేయాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వందలాది ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయుడితో నిర్వహించబడుతున్నాయి. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు ప్రతిరోజు కాంప్లెక్స్‌కు వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకువచ్చి ఐదు తరగతుల విద్యార్థులకు పరీక్షల నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో ఈ విషయాన్ని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన స్పందించి సీఆర్పీల ద్వారా ప్రశ్నపత్నాలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

లారీని బస్సు ఢీకొని నలుగురికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల పరిధిలో లారీని బస్సు ఢీ కొట్టిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మద్దిపాడు ఎస్ఐ వెంకట సూర్య కథనం మేరకు ... ఉదయగిరికి చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి ఉదయగిరి వెళుతూ ఏడుగుండ్లపాడు వద్ద వంతెనపై ముందు వెళుతున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

వల్లాయపాలెం పంచాయతీని మర్రిపూడి సచివాలయంలో విలీనం చేయాలి

మర్రిపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వల్లాయపాలెం పంచాయతీని మర్రిపూడి సచివాలయంలో విలీనం చేయాలని గ్రామస్థులు గత ఐదేళ్లగా ప్రభుత్వాన్ని వేడుకుంటూనే ఉన్నారు. ప్రస్తుతం వల్లాయపాలెం పంచాయతీ పన్నూరు సచివాలయ పరిధిలో ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులకు కష్టాలు ఆరంభమయ్యాయి. ప్రతి చిన్నపనికి నిర్మాపురం, వల్లాయపాలెం గ్రామస్థులు పన్నూరు వెళ్లాల్సివస్తుంది. పన్నూరు. వల్లాయపాలెం గ్రామల మధ్య రహదారి లేకపోవడంతో శివరాయునిపేట మీదుగా 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. దీనికి తోడు బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరగడంతో కాలినడకన వెళ్లే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండి వాగులు ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. వల్లాయపాలెం, మర్రిపూడి గ్రామాల మధ్య కేవలం ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పక్కాగా తారురోడ్డు నిర్మాణం పూర్తి అయింది. నిత్యం వల్లాయిపాలెం గ్రామస్తులు ప్రతి అవసరానికి మర్రిపూడికి వస్తారు. ఈనేపథ్యంలో మర్రిపూడి సచివాలయంలో విలీనం చేస్తే అంతా బాగుంటుందని ప్రజలు చెబుతున్నారు.

చిర్రికూరపాడు పంచాయతీ
కార్యదర్శి సస్పెన్షన్

- చుండిలో ప్రభుత్వ భూమిపై ఇతరులకు ధ్రువీకరణపత్రం జారీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం చిర్రకూరపాడు పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం చుండి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో గ్రామకంఠ (ప్రభుత్వ భూమి) భూమిని ఇతరులకు ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. దీంతో గ్రామస్థులు నెల్లూరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో ప్రభుత్వ భూమిని ఇతరులకు ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ రాజాబాబును కోరారు. దీంతో విచారణ ఫైల్‌ను పరిశీలించిన కలెక్టర్ బుధవారం రాత్రి అనిల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సగం సచివాలయాలు ఖాళీ!

కార్యాలయాల్లో కనిపించని సెక్రటరీలు

- మరికొందరు మధ్యాహ్నం నుంచి మాయం
- అరకొర సేవలతో ప్రజలకు పాట్లు
- రీ గ్రూపింగ్ తర్వాత కూడా మారని తీరు


హౌసింగ్ బోర్డు కాలనీలో విధుల్లో ఉన్న ఒకేఒక ఉద్యోగి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వార్డు సచివాలయాల్లో ప్రజలకు సేవలు కరువయ్యాయి. కార్యాలయ పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సెక్రటరీలు ఫీల్డు పేరుతో డుమ్మా కొడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు రీ గ్రూపింగ్ చేసింది. విజన్ యూనిట్‌లుగా సచివాలయాలను మార్చాడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సచివాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే సెక్రటరీల పనితీరులో మార్పు లేకపోగా, ఆయా డివిజన్ ప్రజలు పదే పదే సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒకరిద్దరు సెక్రటరీలు మాత్రమే ఆఫీసుల్లో ఉండటం, తమకు కావాల్సిన పని గురించి అడిగితే ఆ విధులు తమ పరిధి కాదని చెప్పడం పరిపాటిగా మారింది. ఒంగోలు నగరంలో 71 సచివాలయాల్లో 710 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, సచివాలయాల ప్రారంభం నుంచి 650 మందితో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో వైసీపీ పాలనలో వలంటీర్ వ్యవస్థ అందుబాటులో ఉన్నపుడు పనిభారం మొత్తం వారి మీద వేసి, కార్యాలయాలకే పరిమితం అయిన సెక్రటరీలు ఇప్పుడు పౌరసేవలంటేనే పెదవి విరుస్తున్నారు. ఆఫీస్ పనివేళలు పాటించరు. కనీసం ప్రజలకు అందుబాటులో ఉండని సెక్రటరీల తీరుపై ప్రజల్లోనూ అసహనం నెలకొంది. రోజు వచ్చామా.. పోయామా అన్నట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సచివాలయాలకు వెళ్లాలంటేనే ప్రజలు వెనకడుగు వేస్తున్నారు.

ఉన్నా.. ఉపయోగం లేదు..

ఒంగోలు నగర పరిధిలో 650 మంది వరకు సచివాలయ సెక్రటరీలు పనిచేస్తుండగా, అడ్మిన్‌ల కొరత ఉంది. డెబ్బై సచివాలయాలకు గాను 49 మంది ఉండగా, కార్పొరేషన్ నుంచి మరో పది మంది బిల్ కలెక్టర్‌లను అడ్మిన్‌లుగా నియమించారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 69 మంది ఉండగా, వివిధ ప్రభుత్వ పథకాల పనిభారం వీరిపై అధికంగా కనిపిస్తుంది. మరోవైపు వెల్‌ఫేర్ సెక్రటరీలు 70 మంది ఉన్నప్పటికీ ప్రభుత్వ పరంగా అందించే సంక్షేమ పథకాల గురించి వీరిలో అత్యధిక శాతం మంది ఆ విధులనే విస్మరించారు. ఇకపోతే మహిళ పోలీసులు 71 మంది ఉన్నప్పటికీ, వారు చేసే పని మాత్రం శూన్యం. ఆఫీసుకు వచ్చి వెళ్ళడం, కొందరైతే అసలు రాకుండానే రోజులు గడిపేయడం జరుగుతోంది. ఎమినిటీ సెక్రటరీలు 51 మంది ఉండగా, ఇంజనీరింగ్ విభాగంతో అనుసంధానం కావడంతో పదిహేను మంది తప్ప మిగిలిన వారు ఖాళీగానే ఉండే పరిస్థితి కనిపిస్తుంది. ప్లానింగ్ సెక్రటరీలు 54 మంది ఉండగా, డివిజన్‌లలో జరిగే వివిధ నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించి ప్లానింగ్ ప్రకారం నిర్మించాల్సి ఉంది. అయితే వారి విధులన్నీ టౌన్ ప్లానింగ్ అధికారులే చూసుకోవడతో వీరికి పెద్దగా పనిలేకుండా పోయింది. ఇక హెల్త్ సెక్రటరీలు 71 మంది ఉండగా, రోజూ ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సేవలు అందించాల్సి ఉంది. వీరు వర్షాలు వస్తేనో, సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడే తప్ప వీరు సేవలు ప్రజలకు పెద్దగా లభించడం లేదు. శానిటేషన్ సెక్రటరీలు 70 మంది ఉండగా, వారిపై ఒక హెల్త్ ఆఫీసర్లు, ఇద్దరు శానిటరీ సూపర్ వైజర్లు, ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. అయితే వీధుల్లో పారిశుధ్యం మాత్రం మెరుగుపడని పరిస్థితి ఉందంటే వారి పనితీరు ఇట్టే అర్థం అవుతోంది.. ఇదిలా ఉంగా 70 సచివాలయాలకు ఎనర్జీ సెక్రటరీలు ఉండగా, వీరు విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తున్నారు. అయితే వీరిలో సగం మంది కూడా సచివాలయాల మొహం చూడని పరిస్థితి ఉంది.

వలంటీర్ విధులు నిర్వహించలేం

ప్రభుత్వం ఇటీవల నక్ష సర్వేను చేపట్టింది. మరోవైపు ప్రతి నెలా మొదటి తారీఖు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌లు అందించాల్సి ఉంది. నగర పరిధిలోని ఇంటి పన్నుల వసూళ్ల, కుటుంబ సమగ్ర సర్వేలు ఇలా వివిధ సర్వేలు వంటి విధులు నిర్వహించాల్సి ఉండటంతో గతంలో వలంటీర్లు చేసిన పని మేము చేయలేమని, ఆ బాధ్యతలు తొలగిస్తే బాగుంటుందని సెక్రటరీలు తేల్చి చెబుతున్నారు. ఇదే సమయంలో సచివాలయాలకు విచ్చేసే ప్రజలకు కనీస సమాధానం చెప్పలేక సర్వర్ ప్రాబ్లం అంటూ సులువుగా తప్పించుకుంటున్నారు. మరోవైపు ఫీల్డు పేరుతో కార్యాలయాల సీట్లలో కనిపించని సెక్రటరీలు, అటు పౌర సేవల్లోనూ, ఇటు ప్రభుత్వ సేవల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది ప్రజల నుంచి వినిపిస్తున్న మాట.

మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు

- ఎనిమిది మోటార్ సైకిళ్లు, ఏడు గొర్రెలు స్వాధీనం

దొనకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల, గొర్రెల దొంగతనాలకు పాల్పడిన ఎనిమిది మంది నిందితులను దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, సిబ్బంది బుధవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో త్రిపురాతకం సీఐ అస్సాన్ విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముండ్లమూరు మండలానికి చెందిన నల్లబోతుల ఏడుకొండలు, తాతపూడి సాగర్, వేముల గణేష్, షేక్ నాగూర్, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.వెంకటనారాయణ, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలానికి చెందిన నాగులూరి ఏలీష, పొదిలికి చెందిన పోలా రాజశేఖర్ నేరస్తులు. వీరిలో ముగ్గురు పాత నేరస్తులు. చెడు వ్యసనాలకు బానిసలై ఒక గ్రూప్‌గా ఏర్పడి రాత్రి వేళల్లో గొర్రెల మందలోని గొర్రెలను, ఇళ్ల ముందు నిలిపిన మోటారు సైకిళ్లను దొంగలించి అమ్ముకునేవారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు ఈ నేపథ్యంలో దొనకొండలో నాలుగు, నూజెండ్లలో రెండు, అద్దంకిలో ఒకటి, ముండ్లమూరులో ఒక మోటారు సైకిల్‌ను, దొనకొండలో మూడు, కొనకనమిట్లలో నాలుగు గొర్రెలను అపహరించారు. ఇటీవల దొనకొండ ప్రాంతంలో మోటారు సైకిళ్ల చోరీలు జరగటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ త్యాగరాజు అప్రమత్తమై తన సిబ్బందితో దొంగల కోసం విస్తృతంగా గాలించారు. దొనకొండలోని అడ్డరోడ్డు వద్ద పోలీస్ నిఘా పెట్టారు. అనుమానితులుగా ఉన్న ఎనిమిది మందిని చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. వారిని పూర్తిస్థాయిలో విచారించగా వారు వివిధ ప్రాంతాల్లో ఎనిమిది మోటారు సైకిళ్ళ, ఏడు గొర్రెలను దొంగలించినట్లుగా తెలిపారు. వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సీఐ వెల్లడించారు. మోటారు సైకిళ్ల దొంగలను చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్ఐ త్యాగరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా వివేకానంద


వివేకానంద

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(వీఆర్ఏ) జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా పాలడుగు వివేకానంద నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో నూతన జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లాకు చెందిన వివేకానందకు అవకాశం లభించింది. ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర జేఏసీ కమిటీ ఇచ్చే సూచనలు, సలహాలకు అనుగుణంగా జిల్లాలో పనిచేస్తూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరుబాట

- 24న కలెక్టరేట్ ఎదుట దీక్ష

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు పోరుబాట పట్టారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట పోరాట దీక్ష, డిసెంబరు 10న చలో ఎస్పీడీ కార్యాలయం వంటి కార్యక్రమాలు చేపడతామని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్యాణి తెలిపారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌ను కలిసి నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సంపత్, శ్రీనివాసరావు, శేఖర్, సుధ, సులోచన, హరిత, ప్రవీణ, రవికుమార్ తదితరులు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00





కంభం చెరువుకు జలకళ

గత ఏడాది అక్టోబరు 2024లో పూర్తిగా అడుగంటిన కంభం చెరువు ఈ ఏడాది 2025 అక్టోబరులో పూర్తిగా నిండి జలకళను సంతరించుకుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కిందట వర్షాలు కురవక పూర్తిగా అడుగంటి ఉన్న కంభం చెరువును చూసి రైతులు, ప్రజలు సాగు, తాగునీటికి తిప్పలు తప్పవని ఆందోళన చెందారు. సరిగ్గా ఏడాదికి వరుస తుఫాన్‌ల ప్రభావంతో గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా కంభం చెరువుకు సమృద్ధిగా నీరు చేరి నిండుకుండను తలపిస్తుండడంతో ఏడాది వరకు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన పనిలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - కంభం, (ఆంధ్రజ్యోతి)


బస్సు డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలి

- అవగాహన కార్యక్రమంలో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్


బస్సు డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఒంగోలు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్లు ఆరోగ్యవంతులుగా ఉండి, రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల పేర్కొన్నారు. బుధవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో జరిగిన బస్సు డ్రైవర్ల అవగాహన సదస్సు ఉచిత వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా డీటీసీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ బస్సు డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. బస్సులో ప్రయాణిస్తున్న వారి ప్రాణాలు డ్రైవర్ చేతులో ఉంటాయి అని గుర్తు చేశారు. రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హితవు పలికారు. ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అందుకు డ్రైవర్లు పనిచేసే సంస్థలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. బస్సులో మంటలను అదుపుచేసే పరికరాలు, ఫైర్ అలారమ్‌లు ఉండే విధంగా డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు... 200 మంది డ్రైవర్లుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మోటార్ వాహన తనిఖీ అధికార్లు కే.రామచంద్రరావు, ఏ.కిరణ్ ప్రభాకర్, ఎల్.సురేంద్ర ప్రసాద్, ఎన్.జగదీష్, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు కే.జయప్రకాష్, యు.ధర్మేంద్ర పాల్గొన్నారు.

అనుమతి లేని కట్టడాలు కూల్చివేత


అనధికార కట్టడాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

చీమకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో అనుమతి తీసుకోకుండా అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్నవారికి హెచ్చరికలు జారీచేశారు. టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులిచ్చిన ఆదేశాలు మేరకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. స్థానిక ఇసుకవాగు సెంటర్ ప్రాంతంలో రెండవ అంతస్థులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పిల్లర్లను, గాంధీనగర్ 2వ లైన్‌లో స్టిల్ట్ ఫ్లోర్‌లో అనుమతిలేని నిర్మాణం చేయడాన్ని గుర్తించి తొలగించారు. ఇకమీదట పట్టణానికి చెందిన ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందిన తదుపరే నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ కోరారు. టీపీవో శారద, వార్డు సెక్రటరీలు కూల్చివేత పనులను పర్యవేక్షించారు.

చర్చలు సానుకూలం

- రాయల్టీ హక్కులు పొందిన సంస్థతో వ్యాపారులకు ఒప్పందం
- కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- నేడు ఫ్యాక్టరీ ఓనర్ల అత్యవసర సమావేశంలో ఒప్పందంపై చర్చ
- మెజార్టీ ఓనర్లు ఆమోదిస్తే గ్రానైట్ రైట్..రైట్

చీమకుర్తి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ రాయల్టీ వసూల హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థతో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు బుధవారం నిర్వహించిన మలి విడత చర్చలు సానుకూలంగా ముగిశాయి. ఇరువర్గాల చెల్లింపుల ప్రక్రియపై మధ్యేమార్గంగా ఒక అవగాహన కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం కుదరటంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కీలకపాత్ర పోషించారు. గెలాక్సీ గ్రానైట్ ఓనర్ల అసోసియేన్ ప్రతినిధులు, ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు, ఏఎంర్ డైరెక్టర్‌తో కలిసి బుధవారం ఒంగోలులోని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గృహంలో చర్చలు జరిపారు. గతంలో మూడు విడతలుగా జరిగిన చర్చలు తదుపరి జరిగిన పరిణామాలపై లోతుగా చర్చించారు. ఫ్యాక్టరీ ఓనర్ల ఇబ్బందులను ఏఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సుదీర్ఘంగా సాగిన చర్చలు అనంతరం ఒక అవగాహనకు విచ్చినట్లు తెలుస్తోంది. కట్టర్‌కి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.35వేలకు అదనంగా జరపాల్సిన చెల్లింపులు ఎంతమేర ఉండాలనేదానిపై ఒక అవగాహనకు వచ్చారు. సింగిల్ బ్లేడ్‌కి రూ.పదివేలు, ఐదు బ్లేడ్లకు ఇరవై వేలు, పది బ్లేడ్లకు ముప్పైవేలు, 14 బ్లేడ్లున్న ఫ్యాక్టరీలకు నలభైవేల రూపాయలను ఏఎంఆర్ సంస్థకి చెల్లించే విధంగా ఒక అవగాహనకు వచ్చారు. ఈ ఒప్పందంపై చర్చించి నిర్ణయం తీసుకోవటానికి గురువారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అందరు ఓనర్లు ఈ అవగాహన ఒప్పందాన్ని అంగీకరిస్తే గ్రానైట్ రవాణాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా సాఫీగా సాగిపోతుంది. చర్చల్లో ఏఎంఆర్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్లు చలువాది బదరినారాయణ, పల్లవా శిల్పారెడ్డి, వీవా నవీన్‌రెడ్డి, ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, మార్వెల్ బుజ్జి, కోడూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనాభా గణన డైరెక్టర్ శ్రీనివాస్

జనగణనను పక్కాగా నిర్వహించాలి

పొదిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 2027లో జరిగే జనగణన ప్రీ టెస్ట్‌ను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ జే శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగణన ముందస్తు ప్రణాళికలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసిన మొదటి ప్రీ టెస్ట్‌ను నగర పంచాయతీలోని 13, 14, 15, 16, 17, 18, 20 వార్డుల్లో నవంబరు 10 నుంచి 30 వరకు చేయాలన్నారు. ప్రతి ఇంటి స్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీరు, మురుగు నీటి పారుదల, మరుగుదొడ్లు, వంటగది లభ్యత, రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, కారు వంటి సౌకర్యాలపై మొత్తం 34 ప్రశ్నలకు సమాధానాలు సేకరించి సక్రమంగా వివరాలను సేకరించాలన్నారు. వార్డు నెంబర్ 18, 20ల్లో ఎన్యుమరేటర్లు యాప్ ద్వారా జియో ట్యాగింగ్ చేసే పద్ధతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ జనగణను ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సేకరించిన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, జనాభా గణన అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, నగరపంచాయతీ కమిషనర్, కేఎల్ఎన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి సహకార వారోత్సవాలు

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు సహకారశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకారాధికారి డి.శ్రీలక్ష్మీ బుధవారం తెలిపారు. సహకార వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు. ఆత్మనిర్భర భారత్ సాధకాలుగా సహకారసంఘాలు ప్రధాన అంశంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని సహకార సంఘాల్లో ఏడురంగుల సహకార పతాక ఆవిష్కరణలు, సహకార ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహకార వారోత్సవాల్లో భాగంగా ఏడు రోజుల పాటు ఏడు సంస్థల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను డీసీవో వివరించారు. మొదటి రోజు ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో, రెండవరోజు పొగాకు ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌లో, మూడవరోజు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో, నాల్గవ రోజు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, ఐదవ రోజు జిల్లా మత్స్యకార సహకారసంఘాల ఆధ్వర్యంలో ఆరవ రోజు కంభం టౌన్ బ్యాంకులో, ఏడవ రోజు ఒంగోలు సూపర్‌బజారులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీసీవో శ్రీలక్ష్మీ ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తం

గ్రామీణ, పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ఇందుకు కారణమైంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎవరి పర్యవేక్షణలో పనిచేయాలి.. వారి విధులపై స్పష్టత ఇవ్వకుండా నియామకాలు చేపట్టడంతో అంతా గందరగోళంగా తయారైంది. కొంతమంది సిబ్బందికి చేతినిండా పనిఉంటే మరికొంత మంది చుట్టపు చూపుగా కార్యాలయాలకు వచ్చి పోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అవసరం లేని పోస్టులు కూడా మంజూరు కావడంతో వారిచేత ఏ పని చేయించుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది...!!

సేవలు అంతంతమాత్రం ● మూడు వర్గాలుగా విభజించినా పెద్దగా కనిపించని మార్పు

కొన్నిచోట్ల అవసరం లేని పోస్టులు ● కొందరు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్న వైనం

'ఆంధ్రజ్యోతి పరిశీలన'లో పలు విషయాలు వెలుగులోకి..

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఒంగోలులో పదిన్నర తర్వాతే తలుపులు తెరిచేది..

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలపై ప్రత్యేకదృష్టి సారించినా క్షేత్ర స్థాయిలో



ఒంగోలులో ఖాళీగా ఉన్న గాంధీనగర్, శివప్రసాద్‌కాలనీ సచివాలయాలు

మాత్రం మార్పురావడం లేదు. ఒక వైపు ఆయా శాఖల ఉన్నతాధికారులు నిరంతరం సచివాలయాలపై ఫోకస్ పెట్టినా ఉద్యోగుల్లో మాత్రం మార్పు కనిపించడంలేదు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని సచివాలయాలు చూస్తే ఈ పరిస్థితి మరింతదారుణంగా ఉంది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి పరిశీలన చేయగా సచివాలయ పనితీరు స్పష్టంగా కనిపించింది. శివప్రసాద్ కాలనీలోని సచివాలయం ఉదయం పదిన్నరకు కూడా తలుపులు తీయడం లేదు. తాపీగా 10.35గంటలకు ఉద్యోగులు ఒక్కొక్కరు వస్తున్న పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ఎన్‌టీఆర్ పార్కు వద్ద ఉన్న గాంధీనగర్ సచివాలయపరిస్థితి కూడా అదే విధంగా ఉంది. కేవలం ఇరువురు ఉద్యోగులు మాత్రమే కార్యాలయంలో కూర్చొని ఉండగామిగిలిన ఉద్యోగులు విధులకు రాలేదు. అలాగే గద్దలగుంట, రాజాపానగల్ రోడ్డు, మంగమూరు రోడ్డులోని సచివాలయాల పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. ఒక్కొక్క సచివాలయంలో ఆరుగురు నుంచి పదిమంది ఉద్యోగులు పనిచేస్తున్నా కేవలం సచివాలయాల్లో ఒకరు లేదా ఇద్దరు ఉద్యోగులు కనిపిస్తుండగా మిగిలిన ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నారాలేదా అనేది కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

వస్తారు.. హాజరు వేస్తారు.. వెళ్లిపోతారు

ఒంగోలు (రూరల్): దశరాజుపల్లి ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్నది.ఆ గ్రామ పంచాయతీ సచివాలయ ఉద్యోగులు అసలు కనిపించరు. ఆగ్రామ సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలన చేయగా 10:50 నుంచి 11:40 గంటల వరకు అడిగేవారు లేరన్నట్లుగా ఉంది సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరవుతున్నారు. ఇక సర్వేయర్, గ్రామపంచాయతీ కార్యదర్శి డిప్యుటేషన్‌పై ఒంగోలు నగరంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పశువైద్యసహాయకుడు శిక్షణ కోసం వెళ్లారు. ఇలా ఉంది సచివాలయ ఉద్యోగులు తీరు.

ముఖం చూపెట్టి విధులకు ఎగ్గొట్టి..

మద్దిపాడు: గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ గాడితప్పుతున్నది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సచివాలయంలో పది మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ సకాలంలో ఒక్కరు కూడా హాజరు కావడం లేదు. దీంతో సచివాలయ సిబ్బంది కోసం ప్రజలు అర్జీలు పట్టుకుని ఎదురుచూడాల్సిన పరిస్థితి. అటు వెల్లంపల్లిలోను ఒకరిద్దరు ఉద్యోగులే సమయపాలన చేస్తుండగా మిగతావారు సర్వే పేరుతో బైటకు వెళ్తున్నారు. ముఖ హాజరు వేసి అనంతరం విధులకు డుమ్మా కొడుతున్నారు.

కనిపించని సమయపాలన..

నాగులుప్పలపాడు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడంతో వివిధ సమస్యలతో వచ్చే ప్రజలు ఉసూరుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి పలు గ్రామాల్లో కనిపించింది. ఉదయం 11 గంటలు దాటినా ఉప్పుగుండూరు-1, చదలవాడ, కండ్లగుంట,కొత్తకోట, నాగులుప్పలపాడు,కనపర్తి తదితర సచివాలయాలలో ఒకరిద్దరు మినహా మిగిలిన అధికారులు,సిబ్బంది తాపీగా విధులకు హాజరయ్యారు. ఎలాంటి పని ఒత్తిడి లేనప్పటికి సాకులు చెబుతూ తమ ఇష్టం వచ్చినప్పుడు వస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

కొండపి నియోజకవర్గంలో..

మర్రిపూడి/కొండపి/సింగరాయకొండ: మర్రిపూడి మండలం పన్నూరు సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలు విషయాలు వెలుగు చూశాయి. డిజిటల్ అసిస్టెంట్ మహిళా పోలీస్, హార్టికల్చర్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యారు. వీఆర్వో సర్వేయర్లు, రీసర్వే కార్యక్రమం కోసం బయటకు వెళ్లారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఒంటి గంట తరువాత విధులకు వచ్చారు. కార్యదర్శి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా పీసీపల్లికి వెళ్లారు. మిగిలిన సిబ్బంది కార్యాలయం వైపు కన్నెతి చూడలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఆయా గ్రామాలలో సరిపడినంత పనిభారం లేకుండా పోయింది. మండలంలో మత్స్యశాఖ, పట్టుపరిశ్రమ, ఉద్యాన, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులు అవసరం లేకపోయినప్పటికీ నియామకాలు చేపట్టడంతో వారు అలంకారప్రాయంగా మారారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయాలను మూడు వర్గాలుగా విభజించినా మార్పులేకుండా పోయింది.

పోలీసుల సేవలేవీ?

గ్రామ సచివాలయాల్లో గత వైసీపీ ప్రభుత్వం మహిళా పోలీసులను నియమించింది. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి పోలీసు స్టేషన్‌లకు సమాచారం ఇవ్వడం వీరి ప్రధాన బాధ్యత. అయితే అవేవీ ఆచరణలో లేవు. కేవలం కొన్ని అవగాహన కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ మాత్రమే చేస్తున్నారు. వీరి పని నామమాత్రంగా మారిపోయింది. వీరిని ప్రభుత్వం నిర్దిష్టమైన పనులకు కేటాయించి సమర్థవంతంగా వినియోగించుకోవాలన్న భావన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

వ్యవసాయ అసిస్టెంట్ల సేవలు పరిమితం

గ్రామాల్లో వ్యవసాయ అసిస్టెంట్లు నామమాత్రంగానే పనిచేస్తున్నారు. ప్రకృతి వ్యవయసాయాన్ని ప్రోత్సహించడంలో కానీ, ప్రత్యామ్నాయ పంటల సాగు పెంచడంలో కానీ వీరిది ప్రేక్షకపాత్రే అయ్యింది. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషకుల కోసం ఏర్పాటు చేసిన వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగుల సేవలు కూడా గ్రామీణులకు పరిమితంగానే అందుతున్నాయి. ఎనర్జీ అసిస్టెంట్ల సేవలు అంతంతమాత్రమే అయ్యాయి.

కొండపి మండలంలో..

కొండపి మండలంలోని అన్ని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు. మండల కేంద్రమైన కొండపి తోపాటు, కొన్ని పెద్ద గ్రామ పంచాయతీల్లో వివిధ ధ్రువీకరణపత్రాల కోసం అర్జీదారులు వస్తున్నారు. చిన్నచిన్న పంచాయతీల్లో మాత్రం వీరికి పెద్దగా పని ఉండటం లేదు. ఎక్కువ సమయం ఖాళీగానే ఉంటున్నారు. కొండపి గ్రామ సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలన చేయగా డిజిటల్ అసిస్టెంట్ వద్ద పది మంది గుమికూడి తమ పనులపై ఉన్నారు. చినకండ్లగుంట గ్రామ సచివాలయాన్ని విజిట్ చేయగా అప్పుడే ఇద్దరు రావడంతో వారి పనిపూర్తి చేసుకొని కార్యాలయంలోనే ఖాళీగా ఉన్నారు.

సింగరాయకొండ మండలంలో..

సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ గ్రామ సచివాలయంలో కేవలం ముగ్గురు సిబ్బంది (వేల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్) హాజరయ్యారు. మిగతా విభాగాల సిబ్బంది 11 గంటల వరకూ రాలేదు. దీంతో వివిధ సమస్యల నిమిత్తం సచివాలయానికి వచ్చిన అర్జీదారులు వేచి ఉండి వెనక్కి వెళ్లారు.



చినకండ్లగుంట సచివాలయంలో ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ

చీమకుర్తిలో సచివాలయ సేవలు మృగ్యం

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో ఎనిమిది వార్డు సచివాలయాలుండగా ఒక్క దానిలో కూడా సమయానికి పూర్తిస్థాయిలో ఉద్యోగులు హాజరైన దాఖలాలు కనిపించలేదు. మధ్యాహ్నం వరకూ ఉద్యోగులు సచివాలయాలకు వస్తూ ఉండటం గమనార్హం. పట్టణంలోని ఒకటో



చీమకుర్తిలో ఒకటో అంతస్తులో ఉన్న సచివాలయం-1

సచివాలయం పరిస్థితి మరింత దారుణం. అద్దె గృహంలో అదీ ఒకటో అంతస్తులో సచివాయాన్ని ఏర్పాటు చేయటంతో ప్రజలకు సేవలు మృగ్యమయ్యాయి. ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలు విషయాలు వెలుగు చూశాయి. క్రిస్టియన్‌పాలెం ఏర్పాటు చేసిన సచివాలయంలో బాధ్యత కల్గిన వార్డు అడ్మిన్ తాను పొదిలికి డిప్యుటేషన్ కోరగా అనుమతించలేదని కోపాన్ని అర్జీదారులపై చూపుతుండటం గమనార్హం. సేవలు కోసం సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అర్జీదారులు వాపోతున్నారు. ఒకటో సచివాలయం అద్దె గృహంలో ఒకటో అంతస్తులో ఒకే ఒక రేకుల గదిలో ఏర్పాటు చేశారు. ప్రజలు సేవలు పొందాలంటే మెట్లు ఎక్కి వినతిపత్రాన్ని అందచేయాల్సి ఉంది.దివ్యాంగులు,వృద్ధులు,మహిళలకు సచివాలయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయినా అధికారుల వైఖరిలో మార్పు లేదు. ఇక ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన సచివాలయానికి వస్తూ పోతున్నారు. వీరిపై పర్యవేక్షణ కరవు అయింది.గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన సచివాలయలో 11 గంటలు కూడా సక్రమంగా తెరచుకోవడం లేదు.

ఘనంగా నూతన గృహాల ప్రవేశం

● హాజరైన ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణాల ప్రారంభోత్సవంలో భాగంగా మంగమూరులో బుధవారం కందుల ఆదిలక్ష్మి అనే మహిళ గృహాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక ఎస్సీకాలనీలో రాష్ట్ర గృహనిర్మాణసంస్థ, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన్-2.0 కింద ఈ గృహాన్ని నిర్మించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ చెన్నారాయుడు, ఏఈ మణిప్రసాద్, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏఈ వీరాంజనేయులు, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరిశ్రీనివాసరావు, ఎంపీపీ బి.విజయ, నాయకులు ఎస్.నారాయణరావు, ఎస్.కృష్ణారావు, అబ్బూరి శ్రీను పాల్గొన్నారు.



ఆదిలక్ష్మి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

18న ధర్నాలు : సీపీఐ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, ఆత్మగౌరవం పేరుతో ఈనెల 18వతేదీన సీపీఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు.

వరద బాధితులకు సరుకుల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సి) ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని తుఫాన్‌నగర్‌లో మొంథా వరద బాధితులకు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ఎలాంటి ఆధారంలేని పేదలకు రెండు నెలలకు సరిపడా సరుకులు అందజేయడం అభినందనీయమన్నారు. ఇటీవల తుఫాన్ కారణంగా అనేక ఇళ్ళు మునిగిపోయాయని, అలాంటి వారికి అండగా ఉండేందుకు ముందుకు రావడం హర్షణీయమని చెప్పారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూలీ పనులు చేసుకునే కాలనీవాసులకు అండగా ఉండటంపై అభినందించారు. కార్యక్రమంలో యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగా శ్రీనివాసరావు, ఇండియన్ లేబర్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, కరుణాకర్, అశోక్ శ్రీనివాసరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సరుకులను అందజేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

16న పూలే నాటక ప్రదర్శన

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే నాటక ప్రదర్శన ఈనెల 16న ఆదివారం సాయంత్రం 6గంటలకు ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో ప్రదర్శిస్తున్నట్లు సింధూర కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ మేరకు బుధవారం తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో చైర్మన్ బాలాజీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, పాటిబండ్ల ఆనందరావు, బాలినేని నాగేశ్వరరావు, ఉన్నం వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటుకు తలపెట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు డిమాండ్ చేశారు. వైసీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఒంగోలులో ఈమేరకు నిరసన ర్యాలీ స్థానిక కలెక్టరేట్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, కేవీ.రమణారెడ్డి, అంజిరెడ్డి, కటారి శంకర్, బొట్లా సుబ్బారావు పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో సంతనూతలపాడులో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ డి.చెంచిరెడ్డి, నాయకులు బి.బ్రహ్మానందరెడ్డి, బి.రామారావు, కోటిరెడ్డి, వేమా శ్రీను, కనకారావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

మద్దిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు అన్నారు. బుధవారం పార్టీ అనుబంధ సంఘాల గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు ప్రమాణ స్వీకార కార్యక్రమం మద్దిపాడులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడకా స్వాములు, గోపీనాథ్, దేవబత్తిన ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, డి.నరసింహారావు, పోతినేని శ్రీనివాసరావు, మందపల్లి శ్రీనివాసరావు, రామలింగయ్య పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నాయకులు

ఆర్చరీలో విద్యార్థి ప్రతిభ

ఒంగోలు విద్య, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో లోటస్ గ్లోబల్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న కటకంశెట్టి గోవర్ధన్‌నాయుడు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నేషనల్ లెవల్ ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. పాలేరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-14 విభాగంలో బాయ్స్ ఇండియన్ రౌండ్‌లో ప్రతిభ చూపి బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో విద్యార్థి గోవర్ధన్‌నాయుడు, కోచ్ గోపీచంద్‌లను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బత్తుల శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

చతుకుపాడులో గృహప్రవేశ కార్యక్రమం

జరుగుమల్లి (కొండపి), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చతుకుపాడు గ్రామంలో షేక్ మస్తానమ్మ అనే లబ్ధిదారు నిర్మించుకున్న గృహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మస్తానమ్మకు ఇంటి తాళాలు, ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న హౌసింగ్ డీఈఈ సత్యన్నారాయణ మాట్లాడుతూ బుధవారం నియోజకవర్గంలో 318 గృహ ప్రవేశాలు బుధవారం జరిగాయన్నారు. కార్యక్రమంలో డీఈఈ సత్యన్నారాయణతోపాటు ఏఈఈ సింగ్, గ్రామ సర్పంచ్ ఎస్తేరమ్మ హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మస్తానమ్మకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న రవీంద్రబాబు

సీయూజీ సిమ్‌కార్డులు అందించాలి

నాగులుప్పలపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు ప్రభుత్వం అందించే సీయూజీ సిమ్‌కార్డులను అందించాలంటూ ఎంపీడీవో తేళ్ల రవికుమార్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకులు కోరారు. బుధవారం నాగులుప్పలపాడులో వారు ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందించారు. సీయూజీ సిమ్‌కార్డులు లేక మస్టర్ల నమోదు తదితర పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జజ్జర సంజీవరావు, ఏలియా, మేరుగ రాంబాబు, పైనం సురేష్ పాల్గొన్నారు.

పుణ్య కర్మలే మోక్ష హేతువులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మనం చేసే పుణ్యకార్యాలే మోక్ష మార్గాలు అవుతాయని ప్రముఖ ఉపన్యాసకులు ఎంవీఎస్.శాస్త్రి అన్నారు. బుధవారం ఒంగోలు దక్షిణంబజార్‌లోని శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆయన ధార్మిక ఉపన్యాసం ఇచ్చారు. తల్లిదండ్రులు దైవ స్వరూపాలని మహాభారతంలో ధర్మవ్యాధుడు స్పష్టం చేశారని, ఎవరికి కుదిరిన మార్గంలో వారు దైవాన్ని ఉపాసిస్తే మోక్షాన్ని పొందుతారని భాగవతం పేర్కొందన్నారు. అనంతరం ఆయనను అర్చకులు శ్రీనివాసాచార్యులు, లలిత కళా అకాడమీ అధ్యక్షులు సంతవేలూరి కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ.శివారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రాజాబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, కమిటీ సభ్యులు డాక్టర్ మధురశ్రీ, బందికట్ల నాగేశ్వరరెడ్డి, టి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొత్తపట్నం, నవంబరు 12(ఆంధ్రప్రదేశ్): కొత్తపట్నంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు బుధవారం పీహెచ్‌సీ డాక్టర్ శ్రావ్య, డాక్టర్ మహేష్‌కుమార్‌రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో విద్యార్థులకు అందజేస్తున్న మెనూ, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను కూడా వైద్యులు పరిశీలించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటినే విద్యార్థులకు తాగునీరుగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవించాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఒంగోలు నగరం బాలాజీనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పోతులపాలెం సచివాలయ పరిధిలో కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు వచ్చి చేరడంతో ఆ ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అక్కడ పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గృహాల్లో వచ్చే చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, డాక్టర్ వైష్ణవి, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : పీడీఎస్‌యూ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరం గడుస్తున్నా విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్‌కుమార్ ఆరోపించారు. స్థానిక మాదాల నారాయణ స్వామి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తామంటూ యువగళంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చి ఇప్పుడు పాత విధానాలనే అమలు చేస్తున్నారని ఆరోపించారు. పీజీ చదివే విద్యార్థులకు 77జీవో ద్వారా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ, ట్రిపుల్‌ఐటీ సంస్థలకు రూ.100కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్.రాజశేఖర్, ఎం.సునీల్, ఎస్.మహర్షి, రాజేష్, వీరేంద్రప్రసాద్, రాంబాబు, లోకేష్, నాగేశ్వర్, రమణ, అఖండ, వినోద్, సిసింద్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం బి.మాల్యాద్రి ఆధ్వర్యంలో టైమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే గ్రామర్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. టైమ్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు జి.అపర్ణ, రవీంద్రబాబు, సుబ్బారావు, శ్రీనివాసరాయల్, ఝాన్సీ మస్తాన్‌బీ, అమర్నాథ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాయాగం

ఒంగోలు కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూకాలనీలోని దుర్గామల్లేశ్వర దేవస్థానంలో బుధవారం విష్వక్సేన ఇష్టి మహాయాగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాముశర్మ, వేదపండితులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

టంగుటూరు (కొండపి), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టుగా మార్చి విక్రయించి గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చాలని డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన జమ్ములపాలెం గ్రామ పంచాయతీని ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్త సేకరణలో పాటించాల్సిన విధానాన్ని క్లాప్ మిత్రలకు వివరించారు. ఇంటింటికీ తిరిగి తడి,పొడి చెత్తలను వేరు వేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఆచప ఆదేశించారు.

పన్నుల వసూలుపై సమావేశం..

జరుగుమల్లి మండలంలోని తూమాడు, పాలేటిపాడు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలుపై గ్రామ సచివాలయ సిబ్బందితో డిప్యూటీ ఎంపీడీవో జీవీ కామేశ్వరరావు బుధవారం సమావేశం నిర్వహించారు. స్వామిత్వ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఆస్తి హక్కుదారులకు నోటీసులు ఇచ్చే విషయమై పలు సూచనలు చేశారు.

సచివాలయ సేవలు అంతంతమాత్రం


మార్కాపురం ఖాళీగా ఉన్న 17వ సచివాలయం


గిద్దలూరులోని 1వ సచివాలయంలో ఖాళీగా ఉన్న సీట్లు


రాచర్లలో ఖాళీగా ఉన్న కుర్చీలు


కంభంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- సర్వేల పేరుతో కార్యాలయాలకు దూరం
- రీ గ్రూపింగ్ చేసినా మార్పు లేని వైనం
- ఉద్యోగుల కొరతతో మిగతావారిపై పనిభారం
- కొందరు ఇలా వచ్చి .. అలా వెళ్తున్నారు
- పనుల కోసం ప్రజల పడిగాపులు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగు చూసిన లోపాలు

మార్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రధానంగా కొన్ని పోస్టులకు చెందిన వాళ్లకు విధులు లేకపోవడాన్ని గ్రహించి వారికి అదనంగా పనులు కేటాయించారు. జనాభా ప్రాతిపదికన కొన్నిచోట్ల సిబ్బందిని తగ్గించారు. కొంతమందికి రెండు సచివాలయాలను అప్పగించారు. నాలుగు పోస్టులకు చెందిన వాళ్లకు ఎక్కువగా పని ఒత్తిడి ఉన్నట్లు గుర్తించి వారిని అన్నిచోట్ల ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇంత వరకు బాగానేవున్నా సిబ్బంది పనితీరులో మాత్రం ఎలాంటి మార్పు లేదు. సర్వేల పేరుతో కార్యాలయాలకు దూరంగా ఉంటున్నారు. మరికొన్నిచోట్ల కంప్యూటర్లు, ప్రింటర్లు సరిగా పని చేయకపోవడంతో చిన్నపాటి పనులపై వచ్చిన ప్రజలు సేవలు అందక వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పర్యవేక్షణ అధికారులు వారిని గాడిలో పెట్టేందుకు కనీస చర్యలు కూడా చేపట్టడంలేదు. మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

పట్టణంలో సచివాలయాల్లో తగ్గిన 56 పోస్టులు

మార్కాపురం పట్టణ పరిధిలో మొత్తం 21 సచివాలయాలు ఉన్నాయి. వాటిల్లో 21వ సచివాలయం మున్సిపల్ కార్యాలయం లోపలే ఉంది. దీనిలో ఉండాల్సిన 10 పోస్టులు ఖాళీనే. మిగిలిన 20 సచివాలయాల్లో మొత్తం 186 మంది పనిచేస్తున్నారు. వాస్తవానికి ఉండాల్సిన 14 మందిలో 10 మంది డిప్యుటేషన్‌పై పలు ప్రాంతాలకు వెళ్లారు. వారంతా ఇక్కడే జీతాలు డ్రా చేసుకుంటున్నారు. నలుగురు ఉన్నత ఉద్యోగాలు రావడంతో రిజైన్ చేసి వెళ్లిపోయారు. ప్రభుత్వం రీగ్రూపింగ్ చేపట్టిన తర్వాత జనాభా ప్రాతిపదికన పలు సచివాలయాల్లో సిబ్బందిని తగ్గించారు. గతంలో పది మంది ఉద్యోగులు ఉండేవాళ్లు. ప్రస్తుతం రీ గ్రూపింగ్ తర్వాత ఆ సంఖ్యను సచివాలయాన్ని బట్టి 6 నుంచి 8 మందికి పరిమితం చేశారు. అడ్మిన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ (డిజిటల్ అసిస్టెంట్), శానిటరీ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎమ్)లు మినహా మిగిలిన 6 పోస్టుల్లో ఒక్కోచోట ఒక్కో విధంగా పోస్టులను కేటాయించారు. ముఖ్యంగా ఎమినిటీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను తగ్గించారు. మొత్తం మీద 56 మంది ఉద్యోగులను తగ్గించి 154 కు కుదించారు.

సక్రమంగా పని చేయని సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్ : సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదు. పట్టణంలోని సచివాలయాలను పరిశీలించగా వైసీపీ హయాంలో మాదిరిగానే సిబ్బంది తీరు ఉంది. నాయుడు వీధిలోని 4వ సచివాలయంలో 11 గంటలకు వార్డు అడ్మిన్ మాత్రమే ఉన్నారు. మహిళా పోలీసు ఉండగా మిగతా సిబ్బంది లేరు. 17, 18 సచివాలయాలలో 17వ సచివాలయంలో ఒక్కరూ కూడా హాజరు కాలేదు. 15వ సచివాలయంలో నలుగురు కన్పించారు. సచివాలయ సిబ్బంది సర్వే పనులపై బయటకు వెళుతున్నారని అధికారులు తెలిపారు. సచివాలయ సిబ్బందికి రేషనలైజేషన్ ప్రక్రియ జరగలేదు. బదిలీలతో సరిపెట్టారు. సచివాలయలోని డిజిటల్ అసిస్టెంట్లకు పని భారం పెరిగింది. ఎక్కువ సచివాలయాల్లో వీఆర్వోలు ఉండకుండా తహసీల్దార్ కార్యాలయంలో ఉండడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళా పోలీస్, వెల్ఫేర్, విద్యుత్ జేఎల్‌లు ఏపని లేక ఖాళీగా ఉంటున్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

గిద్దలూరు : సచివాలయాలకు వచ్చే ఉద్యోగుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నది. అడ్మిన్, డేటా వెల్ఫేర్, సెక్రటరీలకు కొంతమేర పని భారం పెరగగా మిగతా వారికి గతంలో లాగా లేక అంతకంటే తక్కువ పని భారం వచ్చింది. రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల ఉద్యోగులు చుట్టపు చూపుగా వస్తున్నారు. ఉదయం 11.30 గంటలకు కూడా 10 మందికి నలుగురు ఉద్యోగస్తులు మాత్రమే కనిపించారు. మిగతావారు ఏదో ఒక పని చెప్పి బయటకు వెళ్ళినట్లు తెలిసింది. అడ్మిన్ పోస్టు, ఎమినిటిస్ పోస్టు ఇన్‌చార్జి పాలనలో నడుస్తున్నాయి.

కంభం : కంభం మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించడం లేదని విమర్శలు ఉన్నాయి. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. సచివాలయంలో పనిచేసే సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ఎవరైనా అడిగితే సర్వేకి వెళ్లారనే సమాధానం వస్తుంది. సోమవారం ఆంధ్రజ్యోతి ఉదయం 10గంటలకు కంభం సచివాలయం-2కి వెళ్లగా సంక్షేమం, విద్యా కార్యదర్శి, మల్లికార్జున రెడ్డి ఒక్కరు మాత్రమే ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఎవరు లేక కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కంభం-1 సచివాలయానికి ఉదయం 10.40గంటలకు వెళ్లగా వీఆర్వో ప్రసాద్, ఏఎన్ఎం శిరీష, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరి, మహిళా పోలీస్ స్వాతి మాత్రమే ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఎవరు రాలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ లీవ్‌లో ఉన్నారనే సమాధానం వచ్చింది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రీ గ్రూపింగ్ విధానం ఎటువంటి సత్ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు మాత్రం ఉన్నాయి.

రాచర్ల : రాచర సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 11మంది సిబ్బందికిగాను కేవలం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మూడు రోజులకోసారి డిజిటల్ అసిస్టెంట్ వచ్చి పనులు చేస్తుండడంతో ప్రజలు పదేపదే తిరగాల్సిన పరస్థితి ఉంది. మహిళా పోలీస్ లేరు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను ఇన్చార్జి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా నియమించడంతో పనులు సజావుగా సాగడం లేదు.

పొదిలి : పలు సచివాలయాల్లో సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. సిబ్బందికి, అధికారులకు మధ్య సమన్వయలోపం ఉన్నట్లు తెలిస్తుంది. కొంతమందికి చేతినిండా పని ఉంటే, మరికొందరు పని లేక ఇలా వచ్చి అలా వెళ్తున్నారు. పట్టణంలో 8, గ్రామీణ ప్రాంతాల్లో 9 మొత్తం 17 సచివాలయాలు ఉన్నాయి. అందులో ఒక్కొక్క సచివాలయానికి 11 పోస్టుల చొప్పున 187 మంది పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం 158 పని చేస్తున్నారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పత్తాలేని ఉద్యోగులు

త్రిపురాంతకం : ప్రజలకు అందుబాటులో ఉంచి మెరుగైన సేవలందించాల్సిన సచివాలయ ఉద్యోగులు పత్తాలేకుండా పోతున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉద్యోగులు కా ర్యాలయాల్లో కన్పించడం లేదు. త్రిపురాంతకంలోని సచివాలయం-1, 2లో వీఆర్వో, ఫిషరీస్ అసిస్టెంట్ మాత్రమే ఒకచోట, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో మరోచోట కనిపించారు. మిగిలిన వారి విషయమై వాకబు చేయగా కార్యదర్శి వైపాలెం ఇన్‌చార్జిగా ఉండడంతో అక్కడ ఉన్నారని, మిగిలిన ఉద్యోగులు కొందరు గైర్హాజరు, కొం దరు వివిధ పనులపై బయట ఉన్నారని చెప్పుకొచ్చారు. మొత్తానికి నియోజకవర్గంలోని 87 సచివాలయాల్లో ఇదే పరిస్థితి ఉంది. మరోవైపు పుల్లలచెరువులో 60పోస్టులు, వైపాలెంలో 20పోస్టులు కూడా ఖాళీగా ఉన్నా యి. ప్రభుత్వం విజన్ యూనిట్‌గా నిర్ణయించి ఏదేని పనులు చేయించాలన్నా ఇప్పుడున్న విధానంలో ఎక్కువమంది ఉద్యోగులు ఉండి పని తక్కువగా ఉండడంతో నిర్లక్ష్యంతో ప్రజలు వచ్చే పరిస్థితి లేదు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నట్లు గ్రంథ పాలకుడు జీవీ శివారెడ్డి బుధవారం తెలిపారు. 14న చిత్రలేఖనం, 15న పుస్తక ప్రదర్శన, వ్యాస రచన, 16న పాటల పోటీలు, 17న క్విజ్, 18న వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు వేడుకలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు 7989456436 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

గిద్దలూరు : పట్టణంలోని శాఖాగ్రంథాలయం ఆవరణలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈవో అశ్వనీకుమార్ బ్యానర్లను ఆవిష్కరించారు. 14న బాలల దినోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శణ, 16న గ్రంథాలయ ఉద్యమ కారులకు నివాళులు, 17న కవి సమ్మేళనం, 18న ఫొటో ఎగ్జిబిషన్, 19న మహిళ దినోత్సవ వేడుకలు, 20న వివిధ పోటీల్లో విజేతలైన బాలబాలికలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్, ఐసీడీఎస్, మండలపరిషత్ కార్యాలయాలలో పోస్టర్లను ఆవిష్కరించార.

16న ఎన్జీవో సంఘం ఎన్నిక

కంభం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం తాలూకా ఎన్నికలు షెడ్యూల్, అభ్యర్థుల ఎంపిక ఈనెల 16వ తేదీన జరుగుతుందని ఎన్నికల అధికారి ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు పీఎస్ రమణారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, మహిళా జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్‌కు నామినేషన్‌ల స్వీకరణ, తరువాత పరిశీలన ఉంటుందన్నారు. 23న ఎన్నికలు జరుగునని తెలిపారు. ఎన్నికలు ఏకగ్రీవం అయితే 16వ తేదీనే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

24న నిరసన

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 24న జరిగే రైతు సంఘాల నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి అన్నారు. పూల సుబ్బయ్య క్రాంతి భవన్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హనుమారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పామిడి వెంకటరావు మాట్లాడుతూ.. పంటలకు మద్దతు ధర లేకపోవడం, సహకార సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు అందే నాసరయ్య, నాయకులు డి.సోమయ్య, పీవీ కొండయ్య, రామయ్య, వెంకటరామిరెడ్డి, పుల్లయ్య, సాంబశివరావు, తిరుపతిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగేశ్వరరావు, రామక్రిష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీమ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యకుడు డీకేఎం రఫీ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గోళ్లవిడిపి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,300 స్వాధీనం చేసున్నట్లు ఎస్ఐ పీ చౌడయ్య తెలిపారు.

దీక్షధారులకు అన్నదానం

రాచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంజనేయ స్వామి దీక్షధారులకు శివాలయంలో బుధవారం ద గడ్స్ యూత్ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీక్ష పూర్తి అయ్యేంత వరకు మధ్యాహ్నాం అన్నదానం, రాత్రికి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ఆపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

మార్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బుధవారం నియోజకవర్గస్థాయిలో మార్కాపురంలో ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రవీంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయడం వలన పేదలకు వైద్యసేవలు అందడం కష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వెన్నా హనుమారెడ్డి, చిర్లంచర్ల కృష్ణ, ఉడుముల కోటిరెడ్డి, టౌన్ అధ్యక్షులు షేక్ సలీం పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఐదు మండలాల వైసీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎంపీడీవో సత్యం

స్వామిత్వ ద్వారా గుర్తింపు

కొమరోలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలంలో స్వామిత్వ సర్వే ద్వారా గుర్తించి ప్రత్యేక నెంబర్ ఇస్తున్నామని ఎంపీడీవో సత్యం తెలిపారు. మండలంలోని ముక్తాపురం పంచాయతీలోని వెన్నంపల్లి గ్రామంలో స్వామిత్వ సర్వేపై గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామాల్లోని గ్రామ కంఠాల్లోని స్థలాలను, భవనాలను గుర్తించి వారికి హద్దులు చూపించి స్వామిత్వ కార్డులను త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామీణ ప్రాంతాలలోని గ్రామాల్లో స్థల సమస్యలను పరిష్కరించేందుకు స్వామిత్వ సర్వేను చేపట్టి అర్హులైన లబ్ధిదారులకు స్వామిత్వ కార్డులను జారీ చేయనున్నారని తెలిపారు. ఈ కార్డుల ద్వారా వారికి ఆ స్థలంపై కాని, ఆ భవనంపై కానీ పూర్తి హక్కు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, సర్పంచ్ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ఎంపిక చేయండి

రాచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులను ఉపాధి హామీ ద్వారా ఎంపిక చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. 2026-2027 సంవత్సరానికి సంబంధించి చేపట్టే ఉపాధి పనుల గురించి బుధవారం సత్యవోలు గ్రామంలో గ్రామ సభ నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. గ్రామసభల ద్వారా ప్రజలకు మేలు కలిగే పనులను ఎంపిక చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఈ గ్రామ సభలను అందుకోసమే ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఎంపిక చేసుకున్న పనులు, చేసుకోబోయే పనులు గ్రామ ప్రజల ఆమోదంతోనే జరగాలని అన్నారు. ప్రస్తుతం ఎక్కడ పనులు చేశారు, ఎక్కడ చేయబోతున్నారు. అనే విషయాలపై ఆయన గ్రామ పటాన్ని పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం సత్యవోలు సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది వివరాలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, అనుములవీడు పీహెచ్‌సీ వైద్యాధికారి కే రమేష్, పంచాయతీ కార్యదర్శి జి సరస్వతి దేవి, వీఆర్వో కె లక్ష్మీ, ఉపాధి హామీ ఈసీ జే నాగేశ్వరరావు, టీఏ శ్రీనివాసులు స్వామి, సచివాలయ, ఉపాధి హామి సిబ్బంది, టిడిపి నాయకులు సయ్యద్ మియా పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పొదిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ పలురకాల వైద్యసేవలు చేయించుకున్న 15 మందికి రూ.6లక్షల 43వేల చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. వైద్యం చేయించుకోలేని అభాగ్యులకు సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజిరెడ్డి,, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తానికొండ వెంకట్రావు, కాటూరి శ్రీనివాసులు, ఓబయ్య, ఒగ్గు వెంకటరామయ్య, గౌస్ పాల్గొన్నారు.

నేటి నుండి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

రాచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీ గురువారం నుంచి 15వ తేదీ శనివారం వరకు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎమ్మార్సీ, గ్రీన్ అంబాసిడర్స్‌లు గ్రీన్ గార్డులు, ఎస్ హెచ్‌జీవీవో ఏ-2లు, ఎస్‌హెచ్‌జీ మెంబర్స్-2లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. 13న ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచ్‌లకు, 14వ తేదీ శుక్రవారం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎంఆర్‌సీ, గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డ్స్‌లకు, 15న ఎస్‌జీహెచ్, వీవోఏ -2, (ఫర్ జిపి) ఎస్‌హెచ్‌జి-2లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ ఈశిక్షణకు హాజరు కావాలని కోరారు.

పేదలందరికీ పక్కా గృహాల కల్పనే లక్ష్యం

బాపూజీ కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కందుల


గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ పక్కా గృహాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక బాపూజీ కాలనీలో బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా పక్కా గృహాల నిర్మాణానికి భూమిపూజను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముందుగా లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలు అందజేసి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా అర్హులైన పేదలందరికీ గృహాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ అందె పవన్‌కుమార్, ఏఈ సాయిచంద్, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, కనిగిరి బాలవెంకటరమణ, కొప్పుల శ్రీనివాసులు, టౌన్ యూత్ అధ్యక్షులు దొడ్డా దుర్గేష్‌రెడ్డి, నందం శేఖర్, బాబీ పాల్గొన్నారు.

ఏం చేశారని కోటి సంతకాల సేకరణ?

వైసీపీ నాయకులు జగన్ పాలనలో ఏమి చేశారని కోటి సంతకాల కార్యక్రమం చేస్తున్నారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. పక్కా గృహాలకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. పశ్చిమ ప్రకాశానికి ఎంతో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే చేసినట్లు ప్రారంభోత్సవం చేసినందుకా, మార్కాపురం జిల్లా ఇవ్వనందుకా, మెడికల్ కాలేజీని పూర్తి చేయనందుకా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు ఏ మొహం పెట్టుకుని కోటి సంతకాల సేకరణకు వెళ్తున్నారో అర్థం కావడంలేదన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసి అప్పుల ఊబిలోకి నెట్టిన వారికి ప్రజల దగ్గరకు వెళ్లే అర్హత ఉందా అని ఎమ్మెల్యే కందుల ప్రశ్నించారు.

ప్రతి పేదవాడికీ సొంత ఇల్లు

ఎన్టీఆర్ గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి రానున్న మూడున్నర సంవత్సరంలో ప్రభుత్వం ఇల్లు ఇస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రాజానగర్, ఎన్టీఆర్ కాలనీలో కాకర్ల లక్ష్మీదేవి నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గృహప్రవేశ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో లబ్ధిదారులను ఉద్దేశించి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలను ప్రభుత్వం అందచేయడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో 7190 మందికి ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయని, మున్సిపాలిటీ పరిధిలో 114 మందికి మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంజూరు పత్రాలు అందచేశారు. గృహాలు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. పేదల సొంత ఇంటి కళ నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా ఆయన ముందుకు వెళ్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో పేదల ఇంటి కలను నిర్వీర్యం చేశారని, 4.73లక్షల ఇళ్లను రద్దు చేసి పేదలకు అన్యాయం చేశారని తీవ్రంగా విమర్శించారు. 2.73లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకుంటే నాటి వైసీపీ బిల్లులు చెల్లించక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నోట్లో మట్టి కొట్టారని ఆయన ధ్వజమెత్తారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ మరోవైపు అభివృద్ధిలో ముందుకు దూసుకు వెళ్తుందన్నారు. అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్‌చైర్మన్ గోడి ఓబులరెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఇ.వి.రమణబాబు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, హౌసింగ్ డీఈ ఖదీర్‌బాషా, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్, లొక్కు రమేష్, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, బిల్లా రమేష్ పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

ఎర్రగొండపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాల యం, సీడాప్ సంయుక్తంగా ఈనెల 20 వతేదిన జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు బుధవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 9 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. 19 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు 10వతరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తయిన యువతీయువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఆధార్, పాన్‌కార్డు, సర్టిఫికెట్లతో హాజరు కావాలని, వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ విజయకుమారి 9553945387, 8187084281కి సంప్రదించాలని కోరారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డయాలసిస్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం డయాలసిస్ సెంటర్‌లో అందుతున్న సేవలపై ప్రభుత్వ వైద్యాధికారులతోఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న కొత్త డయాలసిస్ కాకుండా మరొక కొత్త కేంద్రం మంజూరుకు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడామని తెలిపారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న బాధితులు నానాటికి పెరిగిపోవటం పట్ల ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. నూతనంగా ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, వివిధ విభాగాల వైద్యులు, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు బుల్లా బాలబాబు, రహీమాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు భరోసా

సీఎం సహాయనిధి పేదలకు ఎంతో భరోసాగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.16,05,862ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.


కాటన్ సంచులను ప్రదర్శిస్తున్న జేవీవీ నేతలు, దాతలు

ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యత

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ సంచుల నియంత్రణ అందరి బాధ్యత అని దాని బదులు కాటన్ సంచులు వాడాలని డాక్టర్లు ఎం. శ్రీకాంత్, వి. శ్రీనాథ్‌లు తెలిపారు. స్థానిక పద్మావతి అతిథి గృహంలో జేవీవీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, శ్రీలక్ష్మీ జూయలర్స్ అధినేత పోతురాజు రత్నం ఆర్థిక సహకారంతో తయారు చేయించిన వేయి ప్లాస్టిక్ రహిత కాటన్ చేతి సంచులను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం మమ్మిడాడి సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, జాతీయ అధ్యక్షుడు షేక్ గయాజ్, రాష్ట్ర నాయకుడు కె.మధు, కొండమ్మ, చిన్నాజి, పాపారాయుడు, జీసుధాకర్, ప్రసాద్, ఏ మురళి, సిద్ధయ్య, మౌలాలి, షేక్ నాయబ్‌రసూల్‌పాల్గొన్నారు.


గొర్రెల కాపరులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మొంథా తుపాన్ వల్ల వ్యాధులు ప్రబలి వందలాది గొర్రెలు, మేకలు మృత్యువాత పడిన పెంపకందారులను ఆదుకోవాలని ఏపీ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఈదర, పూరిమెట్ల, భీమవరం గ్రామాల్లో పర్యటించి గొర్రెల పెంపకం దారులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ ధాటికి జీవాలకు, గాలి కుంటు, మూతి జబ్బులు తదితర వ్యాధులు సోకి వందలాది జీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. దీని వల్ల గొర్రెల పెంపకం దారులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన పెంపకందారులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సబ్సిడీ అందజేయాలని, చని పోయిన ప్రతి జీవానికి రూ. 10వేలు నష్ట పరిహారం ప్రకటించి రైతులకు అందజేయాని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోగుల అనంత రాములు, సమ్మని శ్రీనివాసరావు, పాములయ్య, మధు, మీసాల గోపీ తదితరులు ఉన్నారు.


దర్శిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న
ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ తదితరులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

కనిగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ అన్నారు. ఈమేరకు కనిగిరిలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటీకరణతో పేదలకు వైద్యవిద్యతో పాటు, మెరుగైన వైద్యసేవలు అందుబాటులో లేకుండా పోతాయన్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో డీఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కసుకుర్తి ఆదెన్న, వైసీపీ నాయకులు మున్సిపల్ చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

దర్శి : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపిస్తూ దర్శిలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేశారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరమైతే పేదలకు వైద్య విద్య లభించటం కష్టతరమవుతుందన్నారు ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన దార్ల కోటిలింగం ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు దిరిశాల శ్రీనివాసరావు రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని కోటిలింగం కుమారుడు రాములుకు బుధవారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కంచుమాటి ఏడుకొండలు, దుగ్గినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సచివాలయాల తీరు అస్తవ్యస్తం

అధికశాతం మంది సిబ్బంది గైర్హాజరు
ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు

దర్శి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సచివాలయాల పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. అధికశాతం మంది సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావటం లేదు. దర్శిలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దర్శి-1 సచివాలయంలో మధ్యాహ్నం వరకు కేవలం డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన సిబ్బంది విధులకు హాజరుకాలేదు. కొంతమంది బదిలీపై వెళ్లారని, మరికొందరు క్యాంపులకు వెళ్లారని చెబుతున్నారు. ప్రజలు వివిధ పనులకోసం అక్కడకు వచ్చి సిబ్బంది లేక గంటల తరబడి వేచి ఉండి విసుగు చెంది వెళ్లిపోయారు. రైతుసేవాకేంద్రం తాళాలు తెరచుకోలేదు. హెల్త్ సెంటర్ ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి బిల్డింగ్ ఖాళీగా ఉండటంతో చెట్లు మొలచి అధ్వానంగా మారింది. ప్రతి సచివాలయంలో 12మంది సిబ్బంది ఉన్నప్పటికీ కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే హాజరవుతున్నారు. దీంతో ఇంత మంది సిబ్బంది సచివాలయంలో అవసరమా అన్న అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అనవసరమైన పోస్టులను కుదించి ప్రక్షాళన చేసినట్లు అయితే వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. స్థానిక అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సచివా లయాల్లో సిబ్బంది పనితీరు ఇష్టారాజ్యంగా మారిందని ఆరోపణలు వస్తున్నాయి.


దొనకొండ-2 సచివాలయంలో హాజరైన ఇద్దరు ఉద్యోగులు

అధ్వానంగా సచివాలయాల పనితీరు

దొనకొండ : మండలంలో సచివాలయాల పనితీరు అధ్వానంగా మారింది. దొనకొండ-1, దొనకొండ-2 సచివాలయాలను ఆంధ్రజ్యోతి పరిశీలించగా రెండు చోట్ల వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగిలిన సిబ్బందిని గురించి ప్రశ్నించగా కొందరు సెలవులో, మరికొందరు ఫీల్డ్ వర్క్‌కు వెళ్లినట్టు తెలిపారు.

సచివాలయాలలో కుర్చీలు ఖాళీ

కురిచేడు : కురిచేడు పంచాయతీ కార్యాలయం-1లో పంచాయతీ కార్యదర్శి కుర్చీ ఖాళీగా కనపడింది. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశానికి వెళ్ళినట్లు అక్కడే ఉన్న బిల్ కలెక్టరు తెలిపారు. కంప్యూటరు ఆపరేటరు, బిల్ కలెక్టరు తప్ప కార్యాలయంలో ఎవరూ కనపడలేదు. మిగిలిన సిబ్బంది ఫీల్డ్ వర్క్‌కు వెళ్లారంటూ అక్కడ ఉన్నవారు సమాచారం ఇస్తున్నారు.

సిబ్బంది కొరతతో పనుల్లో జాప్యం

తాళ్లూరు, : మండలంలో సచివాలయ వ్యవస్థ అధ్వానంగా మారింది. నాగంబొట్లపాలెం, దోసకాయలపాడు, విఠలాపురం, తూర్పుగంగవరం సచివాలయాలను ఆంధ్రజ్యోతి పరిశీలించింది. నాగంబొట్లపాలెంకు రెగ్యులర్ కార్యదర్శిలేరు. మిగిలిన సచివాలయాలకు కార్యదర్శులున్నా ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న స్వామిత్రపై అవగాహన సదస్సుకు వెళ్లటంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా సమావేశానికి వెళ్లారు. విఠలాపురం, నాగంబొట్లపాలెం, దోసకాయలపాడు సచివాలయాలకు డిజిటల్ అసిస్టెంట్లు బదిలీపై, డిప్యుటేషన్‌లపై వెళ్లటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


తెరుచుకోని దర్శిలోని రైతు సేవాకేంద్రం

విధుల పేరుతో ఎగనామం

ముండ్లమూరు : ముండ్లమూరు సచివాలయాన్ని ఉదయం 10.30 గంటలకు ఆంధ్రజ్యోతి విజిట్‌చేయగా కార్యదర్శి పరమేశ్వరి మాత్రమే ఉన్నారు. ఆ తరువాత కొద్ది సేపటికి వెల్ఫేర్ అసిస్టెంట్ వచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ హాస్పటల్‌లో, డిజిటల్ అసిస్టెంట్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నారని కార్యదర్శి తెలిపారు. పసుపుగల్లు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్‌లు మాత్రమే ఉన్నారు. పెద్దఉల్లగల్లు సచివాలయంలో కార్యదర్శి జె.రాజరాజేశ్వరి, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగతావారు వివిధ కార్యాలయాలకు వెళ్లారని తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కల నేరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామ ఎస్సీపాలెంలో నూతనంగా నిర్మించిన ఇళ్లను బుధవారం ఎమ్మెల్యే ఉగ్ర టీడీపీ శ్రేణులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఇళ్లు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత పాలకులు గ్రామాలకు దూరంగా సెంటున్నర ఇంటి స్థలం మంజూరు చేసి నిధులు ఇవ్వకపోవడంతో గృహాల నిర్మాణాలు ప్రారంభం కాలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్లులు మంజూరు చేసి వారి కలలను సాకారం చేసిందని అన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 669 గృహాలను పూర్తి చేసిందని వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు పూనూరి ఎలిసమ్మ, జాన్‌వర్గీస్ దంపతులకు ఇంటి తాళం అందజేసి అభినందించారు. కాగా కాలనీ ప్రజలు తమకు ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన ఉగ్ర సంబంధిత అధికారులతో మాట్లాడి భూములను సర్వేచేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆర్. వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, హౌసింగ్ డీఈ కోటిరెడ్డి, ఏఈ సురేష్‌తో పాటు టీడీపీ నాయకులు యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, బి. జయరామిరెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బి. వెంకటేశ్వరరెడి తదితరులు పాల్గొన్నారు.



వగ్గంపల్లిలో ఇంటి లబ్ధిదారుకు తాళం నమూనా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి తదితరులు


కొత్తపల్లిలో పక్కాగృహాల నిర్మాణానికి భూమిపూజ చేసి మంజూరు పత్రాలు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శిలో పక్కా గృహాలకు భూమి పూజ

దర్శి : పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో నూతనంగా నిర్మించే పక్కా గృహాలకు బుధవారం భూమిపూజ చేశారు. మంజూరైన పక్కాగృహాల సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు కనీస మౌలిక సదుపాయాలను తీర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అన్న ఎన్టీఆర్ పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించాలనే లక్ష్యంతోనే పనిచేశారని ఆయన ఆశయాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎంపీడీవో పి. కల్పన, హౌసింగ్ ఏఈ షాకీర్‌బాషా, మండల టీడీపీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు గెర్రె సుబ్బారెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, రాచపూడి పేతురు తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగువద్దు

పీసీపల్లి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు సాగుపై నిషేధం ఉన్నందున రబీ సీజన్‌లో పొగాకు సాగుచేసే రైతులు నల్లబర్లీ పొగాకు సాగుచేయవద్దని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాకృష్ణ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లక్ష్మక్కపల్లి, పిల్లివారిపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన అక్కడ రైతులు సాగుచేసిన వరి, కంది పైర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ రైతులతో ఆయన మాట్లాడుతూ వరి పైరులో ఆకుచుట్టు పురుగు కనిపిస్తున్నదని దాని నివారణకు లీటరు నీటిలో 2 ఎంఎల్‌ల క్లోరోపైరిపాస్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు.అలాగే వరిపొలంలో దోమపోటును తగ్గించేందుకు ప్రతి 2మీటర్ల దూరానికి 20సెంమీల వెడల్పుతో కాలిబాటను తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.రైతులకు కావాల్సిన ఎరువులు రైతుసేవాకేంద్రాలలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కెలలో వీఏఏలను సంప్రదించి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో షబానా, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


వరి పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాకృష్ణ

రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి

ముండ్లమూరు : మండలంలోని పంటలు సాగు చేసిన రైతులందరూ ఈ పంట ద్వారా పంట నమోదు చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని ఈదర, పూరిమెట్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన వరి పంటను సిబ్బందితో కలసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించారని, ఆ పొగాకు సాగు చేసిన రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు. తెల్లబర్లీ సాగు చేసే రైతులు తప్పనిసరిగా కంపెనీ ప్రతినిధుల వద్ద ఎంవోయూ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీఏఏలు తిప్పస్వామి, అంజలి, వాలేశ్వరరావు, దద్దాల మూర్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంత ప్రజలకు మరోసారి మోసం

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ప్రజలను పాలకులు మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మండల కమిటీ సమావేశం ఎం. రత్నారెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, దశాబ్దాల తరబడి పాలకులు ఈ ప్రాంతాన్ని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు మంజూరులో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. లింగన్నపాలెం ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభానికి సీఎం వచ్చి 2026 నాటికి పూర్తి చేసి నీళ్ల ఇస్తానని ప్రకటన చేశారని, ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే పెండింగ్ పనులకు .నిర్వాసితులకు రూ.4వేల కోట్లు నిధులు అవసరమన్నారు.

వచ్చే బడ్జెట్ లో రూ.3వేల కోట్లు నిధులు కేటాయించి సీఎం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, ఎం. రత్నారెడ్డి, పి నరసింహులు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

దొనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని విజయాంజనేయస్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి పడిపూజ, భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మకర్త బాలిరెడ్డి తెలిపారు. స్వామి వారికి ఐదు అరటి మండపాలు, అభిషేకాలు, మంగళ హారతులు నిర్వహిస్తామని, మండలంలోని అయ్యప్ప స్వామి దీక్షాధారులైన స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని బాలిరెడ్డి కోరారు.

నేడు తాళ్లూరులో క్లీన్‌అండ్‌గ్రీన్ గ్రామాలపై శిక్షణ

తాళ్లూరు,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :స్థానిక ఎంపీపీ సమావేశం హాలులో ఈనెల 13 వ తేదీ ఎల్ఎస్‌డీజీ తేమ్-5 క్లీన్‌అండ్‌గ్రీన్ గ్రామాలపై శిక్షణ జరగనున్నట్లు ఎంపీడీవో పి.అజిత బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని తెలిపారు.

నేడు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు భూమిపూజ

పీసీపల్లి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): వెలుగొండ రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదఅలవలపాడులో నూతన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి నేడు భూమిపూజ చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నిలిచిన చేపల వేలం

● హాజరుకాని అధికారి ● పాటదారులు వెనక్కి

ముండ్లమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లంపల్లి, బసవాపురం గ్రామాల్లోని చేపల చెరువుల్లో మూడు సంవత్సరాల పాటు చేపలు పెంచి పట్టుకొనేందుకు బుధవారం వేలం నిర్వహించాల్సి ఉండగా కేవలం గ్రామ సర్పంచ్ జమ్ముల గురవయ్య, పంచాయతీ కార్యదర్శి జీవీ గురునాథం మాత్రమే హాజరయ్యారు. అయితే పాటలో పాల్గొనేందుకు 15 మంది వరకు నగదు, డీడీ తీసుకొని పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చారు. సాయంత్రం నాలుగు గంటలైనా కూడా పాట నిర్వహించాల్సిన డిప్యూటీ ఎంపీడీవో రాలేదు. పంచాయతీ కార్యదర్శి జీవీ గురునాథం, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్‌కు ఫోన్ చేయగా పాటలో పాల్గొనేందుకు వచ్చిన వారితో డిపాజిట్ కట్టించుకోమని, తరువాత నేను వస్తానని చెప్పగా పంచాయతీ కార్యదర్శి గురునాథం మాత్రం ఉన్నతాధికారి లేకుండా నేనెలా పాట నిర్వహించ గలను? అంటూ కొద్ది సేపు ఆగి పోయారు. పాటలో పాల్గొనేందుకు వచ్చిన పా దారులు మాత్రం సమయం మించి పోతుంది, ఏదైనా సమాధానం చెప్పాలని కార్యదర్శిని కోరగా మళ్లీ కార్యదర్శి డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్‌కు ఫోన్ చేశారు. తనకు ఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్ ఉందని, తాను రాలేనని చెప్పటంతో కార్యదర్శి చేసేదేమి లేక పాటను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటలో పాల్గొనటానికి వచ్చిన వారు వెళ్లిపోయారు. ఒకరిద్దరు మాత్రం అధికారులు రాకుండా ఎందుకు పాట పెడుతున్నారని కొందరు ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శిని పాట వాయిదాపై ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఉన్నతాధికారులు లేకుండా తాను వేలం ఎలా పెట్టగలని, అందువల్లనే వాయిదా వేస్తున్నానని తెలిపారు.

వైసీపీకి తాళ్లూరు వైస్ ఎంపీపీ గుడ్‌బై

● నేడు దర్శిలో ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిక


వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి

తాళ్లూరు,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సీనియర్ నాయకుడు, వైస్‌ఎంపీపీ యిడమకంటి వెంకటేశ్వరరెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు బుధవారం తెలిపారు. కష్ట పడి పని చేసే కార్యకర్తలకు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వద్ద అవమానం తప్ప గౌరవం దక్కటం లేదన్నారు.నిజమైన కార్యకర్తలకు నియోజకవర్గంలో ఆదరణ లేనందునే వైసీపీని వీడుతున్నట్లు తెలిపారు. వైసీపీ తన కుటుంబాన్ని గౌరవించి రెండు పర్యాయాలు వైస్‌ఎంపీపీగా పదవిని ఇచ్చిందన్నారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేశానన్నారు.ఎమ్మెల్యే బూచేపల్లివద్ద కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గౌరవం, గుర్తింపు లేనందున వైసీపీని వీడాల్సి వచ్చిందన్నారు.

నేడు టీడీపీలో చేరిక

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో గురువారం దర్శిలో తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరన్నుట్లు వైస్‌ఎంపీపీ తెలిపారు.

సమయపాలన పాటించాలి

పామూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య హెచ్చరించారు. మండలంలోని లక్ష్మీనరసాపురం, నుచ్చుపొద గ్రామ సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉద్యోగులు ఫీల్డ్ మీదకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్ట్రర్‌లో పేరు నమోదు చేయాలన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముత్తాయిపాలెంలో రైతుసాధికార, ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, అందరూ సేంద్రియ పద్ధతిలో సాగు చేసేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వాతావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు.

ఆ నలుగురికే.. పని

- సచివాలయాల్లో వారిపైనే భారం
- మిగిలిన ఉద్యోగులకు నామమాత్రం
- అస్తవ్యస్తంగా సచివాలయాల నిర్వహణ
- మా ఇష్టం.. ఎప్పుడైనా వస్తామన్నట్లుగా తీరు
- హేతుబద్ధీకరణ ప్రహసనం.. విధుల్లో గందరగోళం



బాపట్ల : వార్డు సచివాలయం విధి నిర్వహణలో సిబ్బంది

ఆంధ్రజ్యోతి పరిశీలన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన ప్రక్రియ అంతకంతకూ జఠిలంగా మారుతోంది. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ ప్రక్రియ కొందరికి వరంగానూ, మరికొందరికి శాపంగానూ మారింది. ఆ నలుగురిపైనే పనిభారం అన్నట్లు ప్రక్రియ సాగింది. అదనపు సిబ్బందిగా ఉన్నారని గుర్తించిన మిగిలిన ఉద్యోగులకు నిర్దిష్టమైన విధులు లేకపోవడంతో వారు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో గ్రామ కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటరీ సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వహించేవారికే పని ఉంటోంది. వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరి, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్ అసిస్టెంట్, వార్డు ఎమినిటీస్ సెక్రటరి, శానిటరీ అసిస్టెంట్లకే నిర్దిష్టమైన విధులు ఉన్నాయి. మిగిలినవారి విధుల విషయంలో ఒకింత గందరగోళం నెలకొని ఉంది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రం బిజీ అయిపోయారు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో కొందరిని మాతృశాఖ సహా పలు ఇతర శాఖలకు పంపించారు. ఆ కారణంగా ఆయా సచివాలయాల విధులు కూడా వీరిపై పడుతున్నాయి. సచివాలయాల్లో స్థానిక సంస్థలైన పంచాయతీ, మున్సిపాలిటీల అనుబంధ విధుల్లో ఉండే వారికి మాత్రమే పనులు ఉంటున్నాయి. మిగిలిన వారందరికీ ప్రత్యేక సందర్భాల్లో మినహా మిగిలిన సందర్భాల్లో పని ఉండడం లేదు. సచివాలయ సిబ్బందిలో కొంతమందికి ప్రభుత్వం సచివాలయాల విధులతో పాటు, మాతృశాఖల విధులను కూడా కేటాయించింది. ఇలా రెండు చోట్ల పనిచేయాల్సి వచ్చినవారు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇలా రెండు చోట్ల విధుల్లో ఉండే ఉద్యోగుల్లో పలువురు అక్కడ ఉన్నామని (మిగతా 6వ పేజీలో)



అరకొర సిబ్బందితో చీరాల పట్టణంలోని 15వ వార్డు సచివాలయం

అక్రమ అంతస్తుల.. క్రమబద్ధీకరణ

బీపీఎస్ పునరుద్ధరణ

- ఆగస్టు 31 ముందు నిర్మించిన భవనాలకు వర్తింపు
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- బిల్డర్లకు ఊరట.. పురాలకు కాసుల వర్షం

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. బిల్డింగ్ పెనలైజేషన్ స్కీం (బీపీఎస్)ను పునరుద్ధరిస్తూ జీవో ఎంఎస్ నం బరు 225ను బుధవారం జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన బీపీఎస్‌ను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిలిపి వేసింది. ప్రస్తుత ఏన్డీఏ కూటమి ప్రభుత్వం గతంలో లేఅవుట్లు(ఎల్ఆర్ఎస్), ఇప్పుడు భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లైసెన్స్ ఇంజనీర్లు, బిల్డర్స్, నగర ప్రజలు తమ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. బీపీఎస్ మునిసి పాలిటీలకు కాసుల వర్షం కురిపించ నుంది. రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరనుంది.



మురికి వాడలకు 50 శాతం రాయితీ

మురికి వాడల్లో నిబంధనలు అతిక్రమించిన నిర్మించిన భవనాలకు బీపీఎస్ అపరాధ రుసుం 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా ప్రాంతాల వారీగా ఉన్న మార్కెట్ విలువల ఆధారంగా అపరాధ రుసుం విధించబడుతుంది. భవనంలో ఎక్కడి వరకు అయితే.. అక్రమ నిర్మాణమో.. దాని వరకు మాత్రమే పెనాల్టీలు విధిస్తారు. మిగతా ప్రాంతాల్లో యథావిధిగానే ఫీజులు కొనసాగుతాయి.

బాపట్ల, చీరాల నవంబరు 12(ఆంధ్రజ్యోతి):

నిబంధనల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి ముందు నిర్మాణం పూర్తయిన.. 1985 జనవరి ఒకటో తేదీ నుంచి నిర్మించిన భవనాలకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. అంతకు ముందు నిర్మించిన భవనాలకు ఈ పథకం వర్తించదు. 1997కు ముందు నిర్మించిన భవనా లకు జరిమానా 25 శాతం తగ్గిస్తారు. భవనా లకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెం టేషన్, ఫొటోలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. గుంటూరు నగరపాలక సంస్థలో సుమారుగా పది వేలకు పైగా భవనాలు బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. తద్వారా గుంటూరు నగరంలో రూ.60కోట్ల నుంచి రూ.70 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు.

120 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసి పాలిటీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వేలాది భవనాలను క్రమబద్ధీకరించ నున్నారు. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు నోటిఫికేషన్ వెలుబడిన తేదీ నుంచి 120 రోజుల్లోగా తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 'బీపీఎస్. జీవోవీ. ఇన్' వెబ్‌సైట్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, సీఆర్డీఏ పరిధిలోని భవనాలకు మాత్రమే బీపీఎస్ (మిగతా 6వ పేజీలో)

వేడుకగా గృహప్రవేశాలు

- 5,496 ఇళ్లలో చేరిన లబ్ధిదారులు
- జిల్లా స్థాయిలో వేమూరులో కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్
- కార్యక్రమాల్లో చీరాలలో ఎమ్మెల్యే కొండయ్య, బాపట్లలో వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కల నెరవేర్చే దిశగా గతంలోనే ప్రభుత్వం కార్యాచరణ రూపొందించగా బుధవారం ఆయా లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు వేడుకగా జరిగాయి.



వేమూరు: గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లా స్థాయి కార్యక్రమం వేమూరు మండల పరిధిలోని చదలవాడ గ్రామంలో జరిగింది. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులతో పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు చేయించారు. బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల వన్‌టౌన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో టీడీపీ స్థానిక నేతలు, అధికారుల సమక్షంలో గృహ ప్రవేశాలు జరిగాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ 1.0లో భాగంగా జిల్లాలో 46,444 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేపట్టదలచింది. ఇందులో 5,496 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకోగా బుధవారం గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో లాంఛనంగా గృహప్రవేశాలు జరిగాయి. అద్దంకి నియోజకవర్గంలో 7,376 ఇళ్లకు 1,101 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. చీరాలలో 4024 గృహాలకు 286, పర్చూరులో 7,195 గృహాలకు 938, బాపట్లలో 6,000 ఇళ్లకు 724, రేపల్లెలో 8,935 ఇళ్లకు 1,386, వేమూరులో 12,914 గృహాలకు 1061 ఇళ్ల నిర్మాణం పూర్తి అయినట్లు గృహనిర్మాణశాఖాధికారులు తెలిపారు.

14 నెలల్లో 1061 ఇళ్లు పూర్తి

వేమూరు: నియోజకవర్గంలో 14 నెలల కాలంలో 1061 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారుల చేత ఒకే రోజు గృహ ప్రవేశాలు చేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం చదలవాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా నిర్మితమైన గృహాలను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణాల పేరుతో దళారీ వ్యవస్థ ద్వారా, స్థలాలు కొనుగోళ్లు, మెరకల పేరుతో నేతలతో కలిసి రూ.కోట్లు దండుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు నిర్మాణం చేయడంతో పాటు 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ఇప్పటికే 60 శాతం నిర్మాణాలు పూర్తి కాగా డిసెంబరు నాటికల్లా నూరుశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, హౌసింగ్ డీఈ సీతారామయ్య, పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

● బాపట్ల రూరల్: బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాసయోజన గ్రామీణ అర్బన్ పథకం ద్వారా నిర్మించిన గృహాలను బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ సలీమా, టీడీపీ మండల, గ్రామ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, ఆశీర్వాదం, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామయ్య తదితరులు పాల్గొన్నారు.



గోపాపురంలో గృహపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రోడ్డుపాలైన బాలామృతం

- చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు నిరుపయోగం
- గడువు తీరిపోవడంతో పారవేత

ఇంకొల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు, బాలింతలకు అందించాల్సిన బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు రోడ్డు పాలయ్యాయి. పిల్లలకు, బాలింతల ఆరోగ్యం కోసం కేటాయించిన సరుకులు పంపిణీలో జాప్యంతో నిరుపయోగంగా మారాయి. గడువు తీరిన బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు పారేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు నుంచి కడవకుదురు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు బుధవారం అధికసంఖ్యలో దర్శనమిచ్చాయి. గడువు తీరిన ప్యాకెట్లు ఏ అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులో తీసుకువచ్చి ఇలా పడేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు. ఇలా బలవర్ధకమైన ఆహార పదార్థాలను సకాలంలో పంపిణీ చేయకుండా గడువు తీరాయని తీసుకొచ్చి ఇలా పారేయడంపై స్థానికుల్లో చర్చనీయంశమైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు పారేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. రెండు రోజులుగా పర్చూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేస్తుండగా ఆ భయంతో గడువుతీరిన వాటిని ఇలా పడవేసి ఉండారని భావిస్తున్నారు. గతంలో కూడా ఇదే విధంగా జరిగిందని ఆ పరిసర ప్రాంతవాసులు తెలిపారు. అప్పుడు చర్యలు లేకపోవడంతో పునరావృతమైందన్నారు.



రోడ్డు పక్కన పడేసిన ప్యాకెట్లు

నేడు టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

బల్లికురవ, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల తెలుగుదేశం పార్టీ కమిటీ, అన్ని గ్రామాల కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం గురువారం ఉదయం బల్లికురవ పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ సుబ్బారావు తెలిపారు. బల్లికురవ, కొత్తపాలెం గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎ. మోహన లక్ష్మీనరసింహాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పొతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యలకు నివాళులు, 17న కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, క్రీడల పోటీలు, 19న మహిళా దినోత్సవం, మహిళలకు వివిధ పోటీలు, రంగవల్లి, అల్లికలు, 20న అక్షరాస్యత దినోత్సవం, వారోత్సవాల ముగింపు కార్యక్రమం, బహుమతి ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు వివరించారు.

సంతమాగులూరులో...

సంతమాగులూరు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరులో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు బాదం విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, కార్యక్రమాలు నిర్వహించి ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

14న కార్తీక వనభోజనాలు

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో చిట్టాబత్తినవారి రేణుకమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 14న కార్తికమాసం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటి ప్రతినిధి చిట్టాబత్తిన శేషారావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై శిక్షణ

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులకు, 14న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు, 15న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇద్దరు వీఓఏలు, ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇస్తామని వివరించారు. రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

ఇంకొల్లు, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు,కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు.ప్రతి ఒక్కరూ విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పర్చూరులో వైసీపీ ర్యాలీ

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా బుధవారం పర్చూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి బొమ్మల సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి.బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు.

నిధులు మంజూరు చేసి భూసేకరణ చేపట్టాలి

గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

లేకుంటే ఆందోళన తప్పదు

నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ కోరారు. బుధవారం పర్చూరులోని కొల్లావారి కల్యాణ మండప ప్రాంగణంలో నల్లమడ సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చానల్‌కు సంబంధించి గుంటూరు జిల్లాలో భూసేకరణకు గజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారని, భూసేకరణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని చెప్పారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరుకు పొడిగించే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించటం లేదన్నారు. ఇలా జరిగే రైతులతోపాటు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. చానల్ పొడిగింపు కోసం నల్లమడ రైతు సంఘం ఎనిమిది దశాబ్ధాల నుంచి పోరాటం చేస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వ తాత్సారం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అనంతరం నల్లమడ రైతు సంఘ నాయకులు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే వేల ఎకరాలకు సాగునీటితోపాటు, ప్రజలకు తాగునీరు కూడా అందుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలు, రైతులను దృష్టిలో ఉంచుకొని ఛానల్ పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, రావి రమణయ్య చౌదరి, గడ్డిపాటి శ్రీనివాసరావు, భ్రమరాంబ, కాపు సాంబశివరావు, కొల్లా వెంకయ్యచౌదరి, నరిశెట్టి బాబు, మొవ్వా పెద్దన్న కొల్లా నాగేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహం పాల్గొన్నారు.

సోలార్ హబ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

బల్లికురవ, సంతమాగులూరు తహసీల్దార్లతో ఆర్డీవో సమీక్ష



తహసీల్దార్ కార్యాలయంలో సోలార్ హబ్ ఏర్పాటుకు భూసేకరణపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూములను వెంటనే సేకరించే పనులు ప్రారంభించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. బుధవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయంలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన తహసీల్దార్లతో ఆర్డీవో సమీక్షించారు. మెత్తం 1800 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని, రైతులకు ఎకరాకు రూ. 18 లక్షల పరిహారం అందించేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రెండు మండలాల పరిధిలో ఉన్న ఎస్ఎల్ గుడిపాడు, కుందుర్రు, వనామిళ్లపల్లి గ్రామాలలో ఉన్న రైతులను కలిసి భూసేకరణ చేపట్టాలన్నారు. సోలార్ హబ్‌కు రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి వర్గం కూడా ఆమోదం తెలిపిందని చెప్పారు. సోలార్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు అయితే నిరుద్యోగ యువతకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. అనంతరం ఆర్డీవో భూములకు సంబంధించిన మ్యాప్‌ను తహసీల్దార్లతో సమీక్ష చేశారు. ప్రభుత్వ భూములు ఎంత ఉన్నాయి వాటిని కూడా సోలార్ హబ్‌లో తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమీక్షలో తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం వార్చితే విద్యార్థినులకు పోషకాలు ఎలా?

చిక్కీలు గడువు సమీపిస్తున్నా నిల్వ ఉంచడంపై అసహనం

బాలికల వసతి గృహాలు, రేషన్ షాపులు, సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



అద్దంకి హాస్టల్‌లో అన్నం గంజి వార్చుతుండగా ప్రశ్నిస్తున్న దేవి

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల విటమిన్‌లను విద్యార్థులకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తుంటే అన్నం వండే సమయంలో వార్చితే ఏమి ప్రయోజనం అని ఫుడ్ కమిషన్ మెంబర్ జీఎం దేవి ప్రశ్నించారు. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లయిస్ గోడౌన్, మండలంలోని చక్రాయపాలెంలో రేషన్‌షాపు, శింగరకొండ వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను, అద్దంకి పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతిగృహం, కళాశాల బాలికల వసతిగృహాలను బుధవారం దేవి ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి ఆహార నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బీసీ సంక్షేమ కళాశాల వసతిగృహంలో పోర్టిఫైడ్ రైస్‌ను వండే సమయంలో వార్చటం గమనించి ప్రశ్నించారు. వార్చటం ద్వారా పోషకాలు మొత్తం మట్టిపాలు అవుతున్నాయని, విద్యార్థినులకు ఏమి పోషకాలు అందుతాయని సిబ్బందిని ప్రశ్నించారు. అదే సమయంలో బీసీ బాలికల వసతి గృహంలో చిక్కీలు వారం రోజులలో గడువు ముగుస్తుండగా పెద్ద సంఖ్యలో నిల్వ ఉండటం గమనించి వెంటనే విద్యార్థినులకు పంపిణీ చేయాలన్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ బాషా, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రకాష్ రావు, ఏఎస్‌డబ్ల్యూవో స్వరూప, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రభావతి, ఎంఈవో శ్రీనివాసరావు, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, హెచ్‌ఎం బసవయ్య పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు నిరుపేదలకు పోషక ఆహారం ఇవ్వాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, నాగులపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకల బాలికల వసతి గృహంతోపాటు, పలు ప్రభుత్వ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా ఉప్పుటూరులోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంతోపాటు, గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. అదేవిధంగా మార్టూరులోని ఎస్సీ బాలికల వసతి గృహంతోపాటు, నేతాజీ నగర్‌లోని రేషన్ దుకాణాన్ని కూడా ఆమె పరిశీలించారు. నాగులపాలెం ప్రాథమిక పాఠశాల(ఎల్‌ఈ)లో భోజనం పాఠశాలలో తయారు చేయకుండా ఇంటి వద్ద నుంచే వండుకొని తెచ్చి వడ్డిస్తున్నారన్న విషయంతోపాటు గంజి వంచి తయారు చేసిన భోజనం వడ్డిస్తున్నట్లు గుర్తించిన ఆమె సంబంధిత ఉపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయురాలికి మెమో ఇవ్వాలని ఎంఈవో వెంకట్రామయ్యను ఆదేశించారు. ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా డీఎస్‌వో జమీర్‌బాషా, ఎంఈవో-2 ప్రసాద్, సీడీపీవో సుభద్ర, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

వెలిగొండ పూర్తి చేయడమే మా లక్ష్యం

ఇచ్చిన గడువులోనే ఎలా పనిచేయాలో చూడండి

ఇద్దరు వీఆర్వోలపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి నిమ్మల

సమీక్షలతో అధికారుల ఉరుకులు పరుగులు

త్రిపురాంతకం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల తర్వాత మళ్లీ మంత్రి వెంటనే వస్తారని ఊహించలేదేమో కానీ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్న తీరు చూసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై బుధవారం మంత్రి నిమ్మల పరిశీలించారు. ఈనెల 7వతేదీ వచ్చిన మంత్రి నిమ్మల అధికారులకు కొన్ని సూచనలు చేసి వెళ్లారు. ముఖ్యంగా వెలిగొండ ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చే పనులు, టన్నెళ్లలోని నీటిని బయటకు తోడే పనులకు అధికారుల వద్ద నుంచే గడువు తీసుకుని వెళ్లారు. మంత్రి వస్తున్న సమాచారంతో పనులు చేసేందుకు యంత్రాలు తెచ్చి ఉంచడాన్ని ఆయన గమనించారు. అధికారులు మొద్దునిద్ర వీడాలని, గత ప్రభుత్వంలో పనిచేస్తున్నామనే భ్రమలో ఉంటే బయటకు రావాలని హెచ్చరించారు. నిర్దేశించిన లక్ష్యానికి పనులు చేయకపోతే అధికారులైనా, చివరకు నిర్వహణ బాధ్యతలు చూసే ఏజెన్సీలపైనైనా వేటు తప్పదని హెచ్చరించారు. ప్రాజెక్ట్ టన్నెళ్లలోకి వచ్చిన నీటిని తోడేందుకు కూడా ప్రణాళిక లేకపోతే ఎలా అని అన్నారు. నేను వేరే జిల్లాలో ఉండి కూడా ఇక్కడ పనుల ఫొటోలు తెప్పించుకుని చూశానని, అంటే ప్రాజెక్ట్ పట్ల ఎంత శ్రద్ధతో పనిచేస్తున్నామో గ్రహించాలన్నారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంత ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు న్యాయం జరగాలంటే వెలిగొండ పూర్తికావడంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షలో కూడా వారి నిర్లక్ష్యంపై ఆయన తీవ్రస్థాయిలో మాట్లాడారు. వరద నీరు ఎక్కువై సమీప పొలాలపైకి వచ్చి పాడైపోతే నేటికీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.



టన్నెల్ లోపలి నీరు తోడుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

వీఆర్వోలపై చర్యలు తీసుకోండి

దోర్నాల మండలంలోని ఐనముక్కల, యడవల్లి వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లారు. మొంథా తుఫాన్ సమయంలో వెలిగొండ టన్నెళ్ల నుంచి, తీగలేరు ప్రవాహానికి పలువురు రైతుల భూముల్లో పంటలు దెబ్బతిని, పొలాల్లో మట్టి మెరకలు వేసి నష్టపోయామని గతంలో వచ్చినప్పుడు చెప్పిన రైతులే ఈ రోజు కూడా వచ్చారని, కనీసం మంత్రి వచ్చిన సమయంలో సమాచారం ఇచ్చేందుకు వీఆర్వోలు అందుబాటులో లేరని కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వారికి మెమో ఇచ్చి సరైన సమాధానం లేకపోతే సస్పెండ్ చేయాలని సూచించారు. అధికారులకు ఆ మాత్రం బాధ్యత లేకుంటే ఎలాఅన్నారు. తుఫాన్ పోయిన తరువాత వెంటనే పట్టణాలకు, రైతులకు విద్యుత్ ఇస్తారని, మరి రైతులకు ఎందుకు ఇంకా ఇవ్వడంలేదని అన్నారు. దోర్నాల పరిధిలో కొందరి స్తంభాలు పడిపోవడం, కొంతమంది పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయకపోవడం ఆయన దృష్టికి తీసుకురావడంపై నిమ్మల స్పందించారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులతోపాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లారు.

వెలిగొండ పూర్తి ధ్యేయంగా సీఎం కృషి : ఎమ్మెల్యేలు

వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం సీఎం చంద్రబాబు ఆలోచనతో ఉండి ఇలా మంత్రి ద్వారా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారని గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి అన్నారు. సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెలిగొండకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, దానిని పూర్తి చేసి ప్రారంభించే బాధ్యత ఆయనే తీసుకున్నారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పని చేయాలనే సంకల్పంతో సీఎం ఉన్నారని అన్నారు.

జాతికి అంకితం ఎలా చేశారు : ఎరిక్షన్‌బాబు

వెలిగొండ పూర్తి చేయకుండానే ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూ వైసీపీ పాలకులు జాతికి ఎలా అంకితం చేశారని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఎద్దేవా చేశారు. ఆరోజు చప్పట్లు కొట్టిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇప్పుడు వెలిగొండకు నిధులు ఇవ్వండని అడగడం చూసి ప్రజలు నవ్వుతున్నారని అన్నారు. ప్రజలకు మన ప్రభుత్వంపై నమ్మకం ఉందని, ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుందనే విశ్వాసంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీఈ శ్యాం ప్రసాద్, ఇరిగేషన్ అడ్వయిజర్ వెంకటేశ్వరరావు, ఎస్ఈ అబూత్అలీ, మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యంగ్యాస్త్రాలు.. హెచ్చరికలు

మంత్రి నిమ్మల తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూనే అధికారులకు హెచ్చరికలు కూడా చేశారు. సమీక్షకు అధికారులు మాత్రమే ఉండాలని ప్రజలు, ప్రెస్ వద్దని బయటకు పంపుతుండగా మాది ప్రజాప్రభుత్వమని, పరదాలు, బారికేడ్లతో పాలన చేయమని అందరినీ లోపలకు ఆహ్వానించి ప్రజల మధ్యే సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ప్రజల్లో నుంచి ఒకరు ఏదో సమస్యను అడుగుతుండగా ముందు మీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేని గెలిపించే బాధ్యత తీసుకోండని సున్నితంగా చెప్పారు. ఎర్రగొండపాలెం ప్రాంతంలో అభివృద్ధి మేము చేస్తాం, ఓట్లు ఇతరులకు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అలాగే అధికారులతో మాట్లాడుతూ మనకు ఉన్న సమయం తక్కువ అని 2026లో వెలిగొండ నీళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేయాలని చెప్తూ దీనిని బట్టి ఇక 20-20 క్రికెట్ మ్యాచ్‌లాగా పనిచేయాలని, 50ఓవర్ల మ్యాచ్‌లాగా ఆడే ఆట కాదన్నారు. అలాగని చివరి ఓవర్లో ఆడదామని గడువు ముగిసేదాక ఆగితే అప్పుడు గెలవడం కష్టమని గుర్తించాలన్నారు. మళ్లీ నెలరోజుల వ్యవధిలోనే వస్తానని సమీక్ష సమయంలో ఎవరి పనితీరు ఏంటో ఆరోజు తెలుస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, కందుల, ఎరిక్షన్‌బాబు

అవీఇవీ

ఆ నలుగురికే పని

(5వ పేజీ తరువాయి)

చెప్పి ఇక్కడ, ఇక్కడఉన్నామని చెప్పి అక్కడవిధులకు గైర్హాజరవుతున్నారు.

సమస్యల వలయం..

జిల్లాలో సచివాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంలేదని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఎవరిష్టం వచ్చినట్లు వారు వస్తున్నారు.. పోతున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా కొలువుదీర్చిందే తప్ప ఎక్కడా కూడా పారదర్శకత, సహేతుకతకు చోటు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో సచివాలయాల రేషనలైజేషన్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన ఇది తయారైందే తప్ప ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియ సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టకపోగా చిక్కుముళ్లను అలాగే మిగిల్చింది. ఇవన్నీ ఒక ఎత్తయితే అవసరం లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్ నియామకం మొదలుకుని, సదరు సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఇష్టారీతిన వివిధ విభాగాల్లో నియమించుకోవడం ఇవన్నీ కూడా యథావిధిగానే సాగుతున్నాయి. ప్రభుత్వం చెప్పినట్లుగా ఎక్కడా కూడా సిబ్బంది నియామకంలో జనాభా ప్రామాణికం అమలవుతున్న దాఖలాలే కనిపించడం లేదు. దీంతో సచివాలయాలు ఇంకా సమస్యల వలయంలోనే ఉన్నట్లు క్షేత్రస్థాయిలో కనబడుతోంది. గతంలోనూ, హేతుబద్ధీకరణ తర్వాత కూడా జిల్లాలో 477 సచివాలయాలు, 3,500 మంది సిబ్బంది ఉండటం ఎలా సాధ్యమనేది అంతుబట్టని ప్రశ్నగా ఉంది. అవసరం లేని విభాగాల్లో దాదాపు 400 మంది సిబ్బంది ఉన్నారని వారిని సర్దుబాటు చేసి ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. సీన్ కట్ చేస్తే అవే సచివాలయాలు, సిబ్బంది సంఖ్యలో కూడా మార్పులేదు. కానీ రేషనలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో దాదాపు 30 శాతం మంది డిప్యూటేషన్‌పై కలెక్టరేట్ విభాగాల్లోని పనిచేయడమో లేక ఫీల్డ్ విజిట్‌లో ఉండడమో జరుగుతోంది. ఒక సచివాలయంలో అడ్మిన్‌గా వ్యవహరిస్తున్న ఉద్యోగి మరో సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా 40 శాతం సచివాలయాల్లో దర్శనమిస్తున్నాయి. తాజాగా జరిగిన బదిలీల వల్ల కూడా సచివాలయాల్లో దాదాపు 120 వరకు ఖాళీలు ఏర్పడినట్లు సమాచారం.

అక్రమ అంతస్తుల క్రమబద్ధీకరణ

(5వ పేజీ తరువాయి)

వర్తిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భవనాలకు వర్తించదు. దరఖాస్తుతో పాటు ఈసీ, భవనం ఫొటోలు, ఇండెంటి బాండ్ తదితర పత్రాలు జతపరచాల్సి ఉంది. రూ.10 వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. భవనాలకు బిల్డప్ ఏరియా ప్లస్ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం అపరాధ రుసం విధిస్తారు.

జరిమానాలు ఇలా..

నిషేధిత స్థలాల్లో నిర్మించిన భవనాలకు బీసీఎస్ వర్తించదు. 50 చదరపు మీటర్లలోపు ఉన్న రెండు అంతస్తుల భవనాలను క్రమబద్ధీకరణ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. భవన నిర్మాణ అనుమతి రుసుం, అభివృద్ధి చార్జీలు విధిస్తారు. ప్లాన్ తీసుకుని అంతకు మించి నిర్మించిన ఫ్లోర్లకు జరిమానా విధిస్తారు. అపార్ట్‌మెంట్లలో ప్లాన్ లేకుండా నిర్మించిన ఫ్లోర్లకు 600 అడుగుల వరకు చదరపు అడుగుకు రూ.120, 601 నుంచి 1,200 అడుగుల వరకు రూ.150, 1,201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.180, ఆ పైబడిన నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంది. ప్లాన్ అతిక్రమించి నిర్మించిన భవనాలకు 600 చదరపు అడుగుల వరకు రూ.20వేలు, 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.40 వేలు, 1201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.60 వేలు, 2వేల అడుగులకు ఆ పైబడిన నిర్మాణానికి రూ.80 వేలు జరిమానా చెల్లించాలి.

పంచాయతీలు ప్రక్షాళన

గ్రామాల్లో నిరంతరాయంగా సేవలు

నాలుగు విభాగాలుగా పాలన.. ప్రత్యేక ఐటీ వింగ్

మున్సిపాలిటీల తరహాలో చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపంచాయతీల ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక నుంచి గ్రామాల్లో మున్సిపాలిటీల తరహాలో ప్రజలకు నిరంతరం సేవలు అందించనున్నాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా ప్రజలకు సేవలు వేగవంతంగా జరగడంతోపాటు పారదర్శకత పెరగనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా పనిచేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దుచేసి ఆయా పంచాయతీలను స్వతంత్రంగా ఏ ర్పాటు చేశారు. జిల్లాలో 729 గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం ఆదాయం, జనాభా ఆధారంగా విభజించారు. ప్రస్తుతం ఐదు గ్రేడ్‌లకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు ఉండగా ఒక గ్రేడ్ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. జిల్లాలో 38 మం డలాలు ఉండగా ఆయా మండలపరిధిలో అధికంగా ఆదాయం ఉన్న 11 పంచాయతీలను స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలుగా ఏర్పాటు చేయగా, గ్రేడ్-1 పంచాయతీలు 75, గ్రేడ్-2 పంచాయతీలు 265, గ్రేడ్-3 పంచాయతీలు 373, జనాభా 500లోపు ఉన్న గ్రామ పంచాయతీలు ఐదు ఉన్నాయి. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నియమించనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా పిలవనున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లకు సీనియార్టీని బట్టి ఉద్యోగోన్నతులు కల్పించి వారిని పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తారు.

ప్రజలకు సత్వర సేవలు

మునిసిపాలిటీల తరహాలోనే గ్రామ పంచాయతీల్లో పలు విభాగాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అదించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. వీటి ద్వారా సేవలు అందించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో విధానంలో సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకుంటారు. వారికి పంచాయతీ నిధుల నుంచే జీతాలు చెల్లిస్తారు. ప్రస్తుతం పంచాయతీల్లో అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక నుంచి పంచాయతీల్లో ప్లానింగ్ అసిస్టెంట్లుగా పేర్కొంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్ రూల్స్‌ను అమలుచేసే విధగా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటుచేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హతలు ఉన్న సిబ్బందిని వినియోగించుకుంటారు. గ్రామ పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేసింది. రికార్డులను డిజిటలైజేషన్ చేసి గ్రామపంచాయతీల్లో రియల్ టైంలో ప్రజలకు సర్వీసులు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

పాఠశాలల్లో తనిఖీలు

ఒంగోలు విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీలు ప్రారంభించింది. ఏటా 20శాతం పాఠశాలలు చొప్పున ఐదేళ్లల్లో వంద శాతం ఆడిట్ పూర్తిచేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 50 పాఠశాలలను ప్రభుత్వం సోషల్ ఆడిట్‌కు ఎంపిక చేశారు. జిల్లాలో తనిఖీల కోసం 29మంది డీఆర్పీలు, ఇద్దరు ఎస్‌ఆర్పీలు కలిపి 31మందిని నియమించారు. ఈనెల 10 నుంచి సోషల్ ఆడిట్ ప్రారంభం కావాల్సి ఉండగా ఆర్పీలు మంగళవారం నుంచి ప్రారంభించారు. మంగళ, బుధవారాల్లో 29 పాఠశాలల్లో పూర్తిచేశారు. గురు, శుక్రవారాల్లో మిగిలిన 21 పాఠశాలల తనిఖీలను పూర్తిచేయనున్నారు. సోషల్ ఆడిట్‌లో పుస్తకాలు, యూనిఫాం, క్రీడా పరికరాలన్నింటిని పరిశీలించారు. ఆయా అంశాలను అప్పటికప్పుడే యాప్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై ప్రశ్నించి వివరాలను రాబట్టారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి చిక్కీలను కూడా ఆర్పీలు లెక్కించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అక్కడ ఉన్న స్టాక్‌ను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పాఠశాలల రికార్డులన్నింటిని పరిశీలించారు. రెండు రోజులపాటు అన్ని అంశాలను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఒంగోలు నగరంలో మూడు పాఠశాలలకు సంబంధించిన సోషల్ ఆడిట్ బుధవారం ముగిసింది.

రైలు పట్టాలు దాటుతూ వృద్ధురాలు మృతి

సంతమాగులూరు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి మహాలక్ష్మమ్మ(60) బుధవారం పల్నాడు జిల్లా నరసరావుపేట మార్కెట్ సెంటర్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె ఏల్చూరులో చిన్నపాటి బీడీ బంకు పెట్టుకొని జీవిస్తుంటుంది. ఆమె భర్త రామారావు ఇదివరకే మృతి చెంది ఉన్నాడు. ఆమెకు ఉన్న ఇద్దరు పిల్లకూ వివాహాలయ్యాయి. ఆమెసరుకుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద లైన్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్‌లో మతిస్థిమితం లేని యువకుడు హల్‌చల్


పోలీసుల అదుపులో మతిస్థిమితంలేని యువకుడు

మార్టూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని స్టేట్‌బ్యాంక్ కార్యాలయంలో స్థానిక సుగాలీ కాలనీకి చెందిన బుక్య అమర్‌సింగ్ నాయక్ అనే మతిస్థిమితం లేని యువకుడు బుధవారం ఉదయం 11గంటల సమయంలో కొద్దిసేపు హల్‌చల్ చేశాడు. బ్యాంక్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా ఖాతాదారులు ఉన్న సమయంలో ఈ యువకుడు తన ఖాతాలో ఉన్న రూ.1500 కోట్లు ఎవరికి ఇచ్చారు, ఎందుకిచ్చారు, అన్ని పార్టీల వాళ్లు మా ఇంటికి వస్తున్నారంటూ పలు విధాలుగా మాట్లాడుతూ హల్‌చల్ చేశాడు. దానికితోడు యువకుని వద్ద కత్తి, గొడ్డలి ఉండటంతో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ సమయంలో బ్రాంచ్ మేనేజర్ వై.లెనిన్‌బాబు ఫోన్ ద్వారా సీఐ శేషగిరిరావుకు ఫిర్యాదుచేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా తమ సిబ్బందితో బ్యాంక్‌కు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తల్లి, సోదరుని పూచీకత్తు మేరకు ఆ యువకుడిని పోలీసులు ఇంటికి పంపించి వేశారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

ఇంకొల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పట్టణ పరిధిలో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నుంచి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను బిగించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సూర్యఘర్‌కు అర్జీలు పెట్టుకోవాలని సూచించారు.

పేదల సొంతింటి కల సాకారం

మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంలో పలు గృహ ప్రవేశాలు

ఇంటి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కొండయ్య


యజమానురాలితో కలిసి గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


లబ్ధిదారులకు ఇంటి తాళం అందజేస్తున్న డీఈ ఖాదర్‌వలి, ఏఈ రాహుల్

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతి పేదవాని సొంతింటి కల సాకారం దిశగా అడుగులు వేస్తున్నా, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 1వ వార్డు 300 కాలనీలో మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మించిన నూతన సామూహిక గృహాలలో ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే ఎన్‌టీఆర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్విరామ పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అధికారం చేపట్టిన 17 నెలల్లో సుమారు 3 లక్షల నూతన గృహప్రవేశాలు నిర్వహించినట్లు చెప్పారు. చేనేత చీరకు జాతీయ గుర్తింపు, ఇటీవల ఆటోనగర్ సమస్యకు పరిష్కారం, అలాగే క్రిటికల్ కేర్ నిర్మాణంతో పాటు నేడు నూతన గృహ ప్రవేశాలు ఆనందాన్నిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా మేనేజర్ కొండయ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

మార్టూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో పక్కా ఇళ్లను నిర్మింపచేయడమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ డీఈ ఎస్.కె.ఖాదర్‌వలి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో హౌసింగ్ పథకం ద్వారా మంజూరై మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్కాఇళ్లకు ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేసింది. ఆ నిధులతో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు బుధవారం వలపర్లలో మద్ది సీతాదేవి నగర్‌లో గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హౌసింగ్ ఏఈ రాహుల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయడంతో మండలంలో 106 పక్కాఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఒక మార్టూరు పట్టణంలో 24 ఇళ్ళ నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, తొండెపు ఆదినారాయణ, తాటి అంజనేయస్వామి, దిబ్బయ్య, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో....

అద్దంకి, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సొంతిల్లు కట్టించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు చెప్పారు. అద్దంకి పట్టణంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 90 ఇళ్లు నిర్మించారు. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని రాజీవ్‌కాలనీలో గృహప్రవేశం జరిగింది. మరో 170 మంది లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, హౌసింగ్ ఇంచార్జి డీఈ దుర్గారమేష్, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్లు రజనీ, మాగులూరి తిరుపతమ్మ, అత్తులూరి రమేష్, టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న లబ్ధిదారులు, అధికారులు, నేతలు

చంద్రన్న పాలనలో పేదలకు సొంతిల్లు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న పాలనలో పేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని, ఎన్టీఆర్ ఆశయాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రంలో కేవలం 16 నెలల్లోనే 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందజేయటం చారిత్రాత్మక అంశం అన్నారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తామని చెప్పి సెంటు పట్టా పేరుతో జగన్ రెడ్డి ప్రభుత్వం రూ.7,500 కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు.

4 లక్షల ఆర్థిక సాయం

గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి స్థలం కల్పిస్తుందని, సొంత స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకోలేని వారికి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. అందులో రాష్ట్ర వాటా 40 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం ఉండటం వల్ల ఈపథకం మరింత బలపడిందని ఏలూరి పేర్కొన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించడమే చంద్రబాబు లక్ష్యమన్నారు.


ఎమ్మెల్యే ఏలూరి

మోడల్ స్కూల్ ముందు బైఠాయించిన విద్యార్థులు

ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ వేధింపులు తాళలేమంటూ

వాపోయిన వైనం

విచారణ చేపట్టిన అధికారులు


డీఈవో పురుషోత్తంకు సమస్యల పత్రం అందిస్తున్న విద్యార్థినులు

బుర్లవారిపాలెం(చీరాల), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని బుర్లవారిపాలెం వద్ద గల ఏపీ మోడల్ స్కూల్ ముందు ఆ పాఠశాల విద్యార్థులు బుధవారం బైఠాయించారు. ప్రిన్సిపల్ సరళ, వైస్ ప్రిన్సిపల్ సామ్యేల్ విద్యార్థుల నుంచి అధికంగా నగదు వసూళ్లు చేస్తుండటంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు ఆరోపించారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వారు చెబుతున్నారు. విద్యార్థుల ఆందోళన చేపట్టి విషయాన్ని తెలుసుకున్న డీఈవో పురుషోత్తం, జీసీడీవో చారులత, తహసీల్దార్ గోపీకృష్ణ హుటాహుటిన స్కూలు వద్దకు చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వినతిపత్రం స్వీకరించారు. అలాగే ప్రిన్సిపల్ సెలవులో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్, ఇతర సిబ్బందిని సమస్యపై ఆరా తీశారు. విద్యార్థులకు కొంత నగదు వెనక్కి అందజేసినట్లు వైస్ ప్రిన్సిపల్ అధికారులకు సమాధానమిచ్చారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఒక దశలో స్కూల్ కమిటీ ప్రతినిధులకు ఉపాధ్యాయులకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై నాగశ్రీను సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సర్దుబాటు చేశారు.

భూసేకరణపై జేవీపాలెం రైతుల అభిప్రాయసేకరణ

విజయవాడ, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపై చర్చించిన

ఆర్డీవో చంద్రశేఖరనాయుడు


రైతులతో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి నిర్మితమవుతున్న విజయవాడ, కడప, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ జాతీయరహదారికి అవసరమైన భూసేకరణకు సంబంధించి జేవీపాలెం రైతులతో ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అభిప్రాయసేకరణ చేపట్టారు. ముప్పవరం సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మూడో విడత సేకరిస్తున్న ఎకరా 58 సెంట్ల భూమికి సంబంధించిన విస్తీర్ణంపై రైతుల అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. తొలివిడత 28.76 ఎకరాల భూసేకరణ చేయగా, రెండో విడత 5.39 ఎకరాల వ్యవసాయ భూమిని రైతుల నుంచి సేకరించారు. రెండో విడత భూసేకరణలో మిగిలిపోయిన ఎకరా 58 సెంట్లకు సంబంధించి విస్తీర్ణంలో వ్యత్యాసాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ భూమికి సంబంధించి అవార్డు ప్రకటించి భూమిని సేకరిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. వ్యవసాయభూమే తమ జీవనాధారమని, ఎకరాకు రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని రైతులు ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైవే అధికారి హస్సాన్, తహసీల్దార్ సింగారావు, టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గరిమిడి జగన్మోహన్, వీఆర్వో సుబ్బారావు, సర్వేయర్ అనంతారెడ్డి, రైతులు మహేష్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడు పరిశీలన

ముప్పవరం సచివాలయంలో భూసేకరణపై రైతుల అభిప్రాయ సేకరణకు వచ్చిన ఆర్డీవో చంద్రశేఖరనాయుడుకు టీడీపీ నేతలు సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరునిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వివరించారు. సమస్యను పరిశీలించాలన్న ఆర్డీవో సూచనతో హైవే అధికారి హస్సాన్ ఆ రోడ్డును పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వాస్తుకు విరుద్ధంగా శింగరకొండ నిర్మాణాలు

వీలైనంత త్వరగా పునఃనిర్మాణం చేపట్టాలి

ప్రసన్నాంజనేయస్వామి రాజగోపురాలు, ప్రాకార మండపం పరిశీలించిన స్మార్త ఆగమ సలహాదారు విజయభాస్కరశాస్త్రి


దేవస్థానాన్ని పరిశీలిస్తున్న స్మార్త ఆగమ సలహాదారులు విజయభాస్కరశాస్త్రి

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురాలు, ప్రాకారం వాస్తు, శాస్త్ర విరుద్ధంగా ఉన్నాయని, వీలైనంత త్వరగా పునఃనిర్మాణ పనులు ప్రారంభించాలని స్మార్త ఆగమ సలహాదారు విజయభాస్కరశాస్త్రి చెప్పారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాజగోపురాలు, ప్రాకారాలను దాతల సహకారంతో పునః నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం స్మార్త ఆగమ సలహాదారులు విజయభాస్కరశాస్త్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయభాస్కరశాస్త్రి మాట్లాడుతూ పునఃనిర్మాణ పనులు ఆలస్యమైతే దేవస్థానం అభివృద్ధికి ఆటంకాలు కలుగుతాయన్నారు. గణపతి, సుబ్రహ్మణ్యం స్వామిల దేవాలయాలను కూడా పునఃనిర్మాణం చేయాలని సూచించారు. రాజగోపురాలు, ప్రాకార మండపాల పునఃనిర్మాణం, గోశాల, కోనేరు, మరుగుదొడ్ల నిర్మాణం సమయంలో పాటించాల్సిన వాస్తు గురించి వివరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, వేదపండితులు వంగల హరిశంకరావధాని, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వైద్యకళాశాల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలి

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల



అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల చెప్పారు. వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గేమ్ చేంజర్ అయితే నాలుగుసార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు నేమ్ ఛేంజర్‌గా మారారని విమర్శించారు. అన్ని పథకాలకు పేర్లు మార్చటం తప్పా ఏమి అభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ర్యాలీలో శ్యామల, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

అవీఇవీ

గృహాలకు వాడే సైజు రాళ్లకు సీనరేజ్ వసూళ్లపై ఆగ్రహం

రామాంజనేయపురం వద్ద రాళ్ల ట్రాక్టర్‌ను నిలిపిన కంపెనీ సిబ్బంది


ట్రాక్టర్‌ను నిలిపేసిన సిబ్బంది

బల్లికురవ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : కొండ ప్రాంతంలో వృథాగా పడి ఉన్న రాళ్లను సైజు రాళ్లుగా చేసుకుని గృహాలకు తరలిస్తుంటే వాటికి సీనరేజ్ కట్టాలని ఓ కంపెనీ ప్రతినిధులు అడ్డుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలకు వెళ్లే రాళ్లకు సీనరేజ్‌లు వసూలు చేసుకోవాలని, గృహాలకు వినియోగించే మట్టి, రాళ్లకు సీనరేజ్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం ఉదయం రామాంజనేయపురం వద్ద ఒక ఇంటికి రైతు తీసుకుపోతున్న సైజు రాళ్ల ట్రాక్టర్‌కు సీనరేజ్ చెల్లించాలని కంపెనీ సిబ్బంది నిలుపుదల చేశారు. ఇలా అయితే గృహాలు ఎలా కట్టుకోవాలని వారు ప్రశ్నించారు. నిలుపుదల చేసిన సిబ్బంది మాత్రం తాము ఏమి చేయలేమని, తాము జీతాలకు పనిచేస్తున్నామని మీరు కట్టాల్సిందే అని అనటంతో చేసేది లేక సీనరేజ్ చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకుపోయారు. నిబంధనలను సడలించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే గృహాల నిర్మాణాలు చేయటం చాలా కష్టం అవుతుందని వారు అంటున్నారు.

వంతెనలను త్వరగా నిర్మించాలి

వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్


కూలిన వంతెనను పరిశీలిస్తున్న వెంకటేష్

రామాపురం(చీరాల), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతాల్లో నూతన వంతెనల ఏర్పాటు వేగవంతంగా జరగాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ చెప్పారు. బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వాడరేవు - రామాపురం మార్గంలో తుఫాన్ కారణంగా కూలిన వంతెనలను పరిశీలించారు. మొంథా కారణంగా ఒకవైపు మత్స్యకార కుటుంబాలు, మరొక వైపు రైతన్నలు, నేతన్నలు పూట గడవని పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టాలతో పాటు, దెబ్బతిన్న రోడ్లు, వంతెనల ఏర్పాటుపై చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ప్రభుత్వం మెడికల్ కళాశాలల పట్ల తీరును నిరసిస్తూ పట్టణంలోని ముక్కోణం పార్కు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డితో ర్యాలీ నిర్వహించి, వినతిని అందజేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక ఆదాయం


సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి చెప్పారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం, అలవలపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చినబాబు, గోపీకిరణ్, రైతులు పాల్గొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌తో ఉత్తీర్ణత శాతం పెంచాలి


స్కూల్‌ను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శివకుమార్

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శివకుమార్ చెప్పారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్‌లో ఎస్ఏ 1 పరీక్షలను బుధవారం శివకుమార్ పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడీ పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. సీ, డీ గ్రేడ్ ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయండి

పార్టీలో 1400 మందికి పదవులు

మండల పార్టీ అధ్యక్షులుగా పురుషోత్తం, సీతారామాంజనేయులు

పట్టణ అధ్యక్షునిగా వెంకట సురేష్ నియామకం

ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కొండయ్యను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పదవులు పొందిన వారు పనిచేయాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో 1400 మందికి పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ పదవులను కేటాయించారు. వీరిలో చీరాల మండల టీడీపీ అధ్యక్షునిగా గంజి పురుషోత్తం, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షునిగా గుత్తి సీతారామాంజనేయులు ఎన్నికయ్యారు. పదవులు పొందిన వారితో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణలు ఉల్లంఘించకుండా నిబద్ధతతో టీడీపీ సిద్ధాంతాన్ని అనుసరించి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం నేతలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. పట్టణ అధ్యక్షునిగా దోగుపర్తి వెంకట సురేష్ నియమించారు.


ఇమామ్, మౌజన్ల వేతనాలు మంజూరు

ఆక్వా రైతులకు లైసెన్సు తప్పనిసరి

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి : నెల్లూరు ఆర్డీవో అనూష

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- పూర్తి వివరాలు 8లో..





ఆరుగురికి ఇద్దరు

ఆంధ్రజ్యోతి పరిశీలన



ప్రతి సచివాలయంలో విధుల్లో ఉండాల్సిన సిబ్బంది 11 మంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్‌లో 6 నుంచి 8 మందిని మాత్రమే నియమించారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే, ఉన్న సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేయాల్సిన సచివాలయ వ్యవస్థ జిల్లాలో పూర్తిగా గాడితప్పింది. పర్యవేక్షణ అధికారులు పత్తాలేకుండాపోవడంతో సిబ్బందిదే ఇష్టారాజ్యమైంది. సర్వేల పేరిట ఫీల్డ్ విజిట్ అంటూ బయటకు వెళ్లిపోతున్న వారంతా తిరిగి కార్యాలయాలకు ఎప్పుడొస్తారో తెలియదు. వివిధ పనుల కోసం సచివాలయాలకు వస్తున్న ప్రజలు విసిగి వేశారి ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నారు.నెల్లూరులోని పలు ప్రాంతాలలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఆకస్మిక విజిట్‌లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- సచివాలయాల్లో ఇదీ పరిస్థితి
- కొందరిది కాలక్షేపం.. ఇంకొందరిది పలాయన మంత్రం
- ప్రజలకు అందని ప్రభుత్వ సేవలు



అనంతసాగరం : సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు



కావలి రూరల్ : కొత్తపల్లి సచివాలయంలో విధుల్లో ఉన్న సిబ్బంది

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉత్తమ సేవలందించాలనే ఉద్దేశంతో ఏర్పడిన సచివాలయాల వ్యవస్థ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. కొంతమంది కార్యదర్శులు కష్టించి పనిచేస్తున్నా, ఇంకొందరికి అసలు పనే ఉండటం లేదు. మరి కొందరేమో పేరుకే సచివాలయ కార్యదర్శులు. కానీ ఎప్పుడూ సచివాలయాల మొహం చూడటం లేదు. పట్టణాల్లో మున్సిపల్ అధికారులు, మండలాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లు వారిని సచివాలయాల గడప తొక్కనివ్వకుండా తమ కార్యాలయాలకు రప్పించుకొంటున్నారు. ఫలితంగా సచివాలయాలు కొందరు కార్యదర్శులకు కాలక్షేప కేంద్రాలుగా, మరి కొందరికి అతిథి గృహాలుగా మారిపోయాయి.

- వీరే దిక్కు..

ప్రతి సచివాలయంలో ఎవరున్నా లేకున్నా కార్యాలయానికి అతుక్కొని కనిపించే కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు. సచివాలయానికి వచ్చే ప్రజలకు వీరే జవాబు దారీగా ఉండాలి. కానీ వీరికి నిమిషం తీరిక ఉండటం లేదు. ఎందుకంటే కీలక శాఖలకు చెందిన పలువురు కార్యదర్శులు సచివాలయాల్లో లేరు. వీరిని వీరి శాఖాధిపతులు సచివాలయంలో ఉండనివ్వడం లేదు. వీఆర్వోలు తహసీల్దారు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. ఇంజనీరింగ్ కార్యదర్శులు మండల ఏఈలకు అటాచ్ అవుతున్నారు. హెల్త్ సెక్రటరీని పీహెచ్‌సీకి పిలిపించుకొంటున్నారు. పట్టణ సచివాలయాల్లో ప్రణాళిక కార్యదర్శిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వెంట తిప్పుకొంటున్నారు. సచివాలయాలకు వెళ్లినా ఈ కార్యదర్శుల సేవలు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇక పంచాయతీ కార్యదర్శి, అడ్మిన్ సెక్రటరీలను పన్ను వసూళ్ళకు వెళ్లమంటున్నారు. ఆంధ్రజ్యోతి సచివాలయాలను విజిట్ చేయగా పలు సచివాలయాల్లో ఈ పరిస్థితి కనిపించింది.

నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు వద్దనున్న 2/3 సచివాలయంలో 11.04 గంటలకు అడ్మిన్, వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు తప్ప ఎవరూ లేరు. అదేమని అడిగితే కొందరు ఇన్‌చార్జిలుగానూ, ఎడ్యుకేషన్ సెక్రటరీ సెలవులోనూ ఉన్నారని, ఇన్‌చార్జిలుగా ఉన్నవారు అవసరమైనప్పుడు వస్తారని తెలిపారు. అలాగే, జాతీయరహదారికి ఆనుకుని పద్మావతి గ్రీన్‌సిటీలో ఉన్న 13/1 సచివాలయాన్ని 11.48 గంటల సమయంలో సందర్శించగా ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఉమెన్ ప్రొటక్షన్ సెక్రటరీ మాత్రమే ఉన్నారు. అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీలు వీఆర్ స్కూల్లో టీచర్లుగా వెళ్తున్నారని, మిగిలిన వారు సర్వేల కోసం వెళ్లారని తెలిపారు. దీంతో సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఇదే ప్రాంతంలోని 13/2 సచివాలయంలోనూ ఇద్దరు ఉద్యోగులు మాత్రమే కనిపించారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



ఈయన పేరు దారా రామయ్య. యూరియా కార్డు కోసం సంగం-2 సచివాలయానికి వెళ్లాడు. సిబ్బంది లేకపోవడంతో అక్కడే పడిగాపులు కాశాడు. విసిగి వేశారిపోయి ఇంటిముఖం పట్టాడు.

ఉదయగిరి సచివాలయం-2లో ఈ ఇద్దరే దిక్కు



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లి సచివాలయంలో..



ఆత్మకూరు : 5వ వార్డు సచివాలయంలో పనిలో నిమగ్నమై ఉన్న సిబ్బంది



మనుబోలు : పిడూరు సచివాలయంలో ఖాళీగా ఉన్న డీఏ కుర్చీ

'సోమశిల' నుంచి ఆగిన నీటి విడుదల

అనంతసాగరం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటిని అధికారులు ఆపేశారు. ఎగువ ప్రాంతం నుంచి బుధవారం 9,012 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ఇక దిగువ ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయంలో 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. క్రస్ట్‌గేట్లు దించేయడంతో జలాశయం ముందు వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి.

- **రాపూరు :** కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 820 క్యూసెక్కులు ఉన్నట్లు పేర్కొన్నారు.

బీపీఎస్ వచ్చేసిందోచ్!

ఆరేళ్ల ఎదురుచూపులకు తెర

120 రోజుల్లోపు దరఖాస్తు నమోదుకు అవకాశం



నెల్లూరు(సిటీ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆరేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజ్డ్ స్కీం) వచ్చేసింది. ఇంటి ప్లాన్ లేకుండా, ప్లాన్‌తో నిర్మించి అనధికార నిర్మాణాలున్న కట్టడాలన్నీ బీపీఎస్ పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో బీపీఎస్‌ను విడుదల చేసిన సర్కారు ఆ తరువాత ఈ ఊసే లేకపోవడంతో ఆరేళ్లుగా నిర్మాణదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం పొందిన ఈ ప్రక్రియకు తుది మెరుగులు దుద్దిన సర్కారు ఎట్టకేలకు జీవో రూపంలో విడుదల చేయడం పట్ల నిర్మాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 31లోపు నిర్మాణం పూర్తయిన కట్టడాలకు ఈ పథకం వర్తిస్తుందని ఉత్తర్వుల్లో సర్కారు తెలిపింది. ఈ పథకం అమల్లోకి వచ్చిన బుధవారం నుంచి 120 రోజుల్లోపు బీపీఎస్ ద్వారా ప్రయోజనం పొందాలనుకునే వారు రూ.10 వేలు చెల్లించి పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలి. 2019 తరువాత ఆగస్టు 31 వరకు నెల్లూరులో శరవేగంగా నిర్మాణాలు జరిగాయి. ఇందులో 10 శాతం అతిక్రమణలోపు ఉన్నవారు కార్పొరేషన్‌లో అనుమతులు పొందగా అంతకు మించి అతిక్రమణ, అనుమతులు లేని భవనదారులు బీపీఎస్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం బీపీఎస్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో భవన నిర్మాణదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి సుమారుగా రూ.50-70 కోట్లు వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



'మాయా పెట్టె'తో పాఠాలు

- పాఠశాలలకు చేరిన 658 నైపుణ్య కిట్లు
- ఒక్కో కిట్‌లో 62 ఆట వస్తువులు
- పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వ నిర్ణయం

8



ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

నెల్లూరు : ఈ ఆటోలో ప్రయాణించాల్సింది నలుగురు లేదా ఐదుగురు. కానీ ఇందులో చూడండి. ఎంతమంది ఉన్నారో ఆ డ్రైవర్‌కే తెలియాలి. అనుకోని ప్రమాదం జరిగితే వీరందరి పరిస్థితి ఏమిటో!?

రహదారులు.. రక్తపుటేరులు!

- భయం భయంగా హైవేలపై ప్రయాణం
- జిల్లా రహదారి భద్రతా మండలి ఏం చేస్తున్నట్టు!?
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- శోకసంద్రంలో మునిగిపోతున్న కుటుంబాలెన్నో!



నెల్లూరు : చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి పక్కనే ఆపి ఉన్న లారీలు

రెప్పపాటులో ఘోరం జరిగిపోతోంది. రక్తం మరిగిన రహదారులపై కాస్త ఏమరుపాటుతనం ఎంతోమంది జీవితాల్లో తీవ్ర విషాదం నింపుతోంది. మొన్న సంగం.. నిన్న నెల్లూరు... రేపు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని జిల్లావాసులు భయకంపితులవుతున్నారు. ప్రమాదం.. మృతులు... క్షతగాత్రులు.. ఇవన్నీ అటుంచితే జిల్లా అధికార యంత్రాంగంపై తీవ్ర విమర్శలు పుట్టుకొస్తున్నాయి. బ్లాక్‌స్పాట్‌లను గుర్తిస్తున్నా ఆ ప్రాంతంలో ప్రమాదాలు నిలువరించలేకపోతున్నారు. జిల్లా రహదారి భద్రతా మండలి సమావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు అమలుకావడం లేదు. మరోవైపు వాహనదారుల నిర్లక్ష్యమూ ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. ఏదిఏమైనా ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయి ఎంతోమందిని మృత్యువు కబళించింది.

- వివరాలు 8లో..

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 600

రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఇంజనీరింగ్ శాఖల రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రామ్‌రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీ.సుబ్రహ్మణ్యం, కోశాధికారి సీఎం వరకుమార్‌లు బుధవారం కందుకూరులో అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వారు, రానున్న రెండు మూడు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వారందరినీ అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్పించటమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ స్థానిక ప్రతినిధులు మురళీమోహన్, మాలకొండయ్య, పొనుగోటి మాలకొండయ్య, అగస్టీన్, అంకయ్య, ఇంటూరి మాల్యాద్రి, హసన్‌సాహెబ్, ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహాల మధ్యలో..
నీటి మడుగులు!

- ప్రబలుతున్న విషజ్వరాలు
- భయాందోళనలో ప్రజలు


కేసరిగుంట కాలనీలో నివాసగృహాల మధ్య నిలిచిన నీరు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో నివాసాల మధ్య ఖాళీస్థలాల్లో నిలిచిన వర్షపు నీరు ప్రమాదకరంగా మారింది. ఖాళీ స్థలాల్లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు వాటిలో చిన్నపాటి చెరువులను తలపించేలా నిలిచిన నీటితో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీలతో పాటు పట్టణంలోకెల్లా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా, విలాసవంతమైన భవనాలు నిర్మించి ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ పరిస్థితి నెలకొంది. ఇక డ్రైనేజీ వ్యవస్థ సరిలేని కొన్ని ప్రాంతాల్లో అయితే చెరువుల్లో గృహాలు నిర్మించుకున్నారా అనిపించేలా నేటికీ వర్షపు నీరు దర్శనమిస్తోంది. పట్టణంలోని కేసరిగుంట కాలనీ, శ్రీనగర్ కాలనీ, తూర్పు ఎర్రగుంటపాలెం, డీవీ నగర్, కోటారెడ్డి నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి వర్షపు నీరు నివాసాల మధ్య మోకాటిలోతున నిలిచి ఉంది. అలాగే సింహాద్రినగర్, సాయినగర్, ఉప్పుచెరువు కాలనీ, ఏకలవ్యనగర్, మహదేవపురం జగనన్న కాలనీ తదితర ప్రాంతాల్లోనూ నివాసాల మధ్య ఖాళీస్థలాలు చెరువులను తలపిస్తోన్నాయి.

● డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టణంలోని అనేక ప్రాంతాల్లో వర్షపునీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న డ్రైనేజీలను ఆక్రమించి ఉండటంతో ఈ దుస్థితి ఏర్పడింది. కేసరిగుంట కాలనీ నుంచి వర్షపునీరు పామూరురోడ్డులోకి వెళ్లేలా ఉన్న డ్రైనేజీ ఆక్రమణలకు గురవ్వడం, అంతర్గత రహదారుల మధ్య లింకు డ్రైనేజీ వ్యవస్థ సరిలేకపోవడంతో ఆప్రాంతంలో ప్రతిఏటా వర్షాకాలం మూడు నాలుగు నెలలు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇక నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు డ్రైనేజీలకు వెళ్లే వ్యవస్థ లేకపోవడం, మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది కానీ ఇంజనీరింగ్ సిబ్బంది కానీ ఇవేమీ పట్టించుకోకుండా వర్షాకాలంలో ఆయిల్‌బాల్స్ వేయడం, దోమల నివారణ మందు స్ప్రే చేయడం తో మమ అనిపిస్తుండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. అలాగే ఉప్పుచెరువు అలుగు వాగు, పంటకాలువలు వెంచర్లతో ఆక్రమణలకు గురవ్వడంతో ఇటీవల కురిసి న వర్షాలతో పలు కాలనీలను వరదనీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. అయితే తాత్కాలిక చర్యలతో సరిపెట్టారే తప్ప సమస్యకు మూలం అర్థమైనా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజలుతున్న విషజ్వరాలు

ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల తర్వాత పట్టణంలో వైరల్‌జ్వరాలు, విషజ్వరాలు ప్రబలుతున్నాయి. తీవ్రమైన జలుబులు, ఒళ్లునొప్పులతో పాటు జ్వరాలతో ప్రజలు మంచం పడుతున్నారు. విషజ్వరాల కారణంగా డెంగ్యూ లక్షణాలు, ప్లేట్‌లెట్స్ పడిపోతుండడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలకు వేలు, లక్షలు వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన సింహమణి అనే యువకుడు డెంగ్యూ లక్షణాలతో ఇటీవల మృతి చెందడంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతోన్నాయి. వర్షాల తర్వాత పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కూడా అంతంతమాత్రంగా మారిందని, దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నివాసాల మధ్య నిలిచిన వర్షపునీటిలో డెంగ్యూ కారక దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, డెంగ్యూ ప్రబలితే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య నిలిచి ఉన్న వర్షపునీరు వెళ్లిపోయేలా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా

● కమిటీలతో ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న రూరల్ మండల టీడీపీ నేతలు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రూరల్ మండలం, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల మండల కమిటీల అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, కో ఇన్‌చార్జిలు మండలాల వారీగా ఎమ్మెల్యే అధ్యక్షతన పార్టీ పరిశీలకులు దొడ్ల సుబ్బారెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు బాగుంటేనే పార్టీ గెలుస్తోందన్నారు. పార్టీలో నిబద్ధత, నిజాయితీతో పని చేసే వారికి ఎల్లప్పుడు తాను అండగా ఉంటానన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఇచ్చిన బాధ్యతలను అందరం కలిసి నెరవేర్చుదామన్నారు. ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ప్రజల మన్ననలు పొందిన పార్టీగా నిలవడానికి కారణం కార్యకర్తల కష్టమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలలో కావలి నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్, కోక్లస్టర్ ఇన్‌చార్జిలు, కో యూనిట్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలి


మనీస్కాం బాధితులతో మాట్లాడుతున్న వేదిక నాయకులు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కావలి వంగుసునవారం అనంతార్థ మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలని ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక నేతలు కోరారు. పట్టణంలోని మనీ స్కాం బాధితులను బుధవారం వేదిక సభ్యులు కలిసి విచారించారు. ఈ కేసులో తమకు ఏమీ తెలియదని బాధితులు తెలిపారు. తాము ఇచ్చిన కేసులు నమోదు అయ్యాయో కాలేదో కూడా తమకు తెలియవన్నారు. దీంతో మనీ స్కాం జరిగి సుమారు ఏడాది కావస్తున్నా బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదని వేదిక సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి స్కాంలో ఇరుక్కున్నవారు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బాధితులు ఎవరైనా తమకు జరిగిన అన్యాయాలపై వేదిక సభ్యులను కలిసి వివరాలు చెపితే ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు కరువది భాస్కర్, పీ.పెంచలయ్య, ఎల్ లక్ష్మీరెడ్డి, దమ్ము దర్గాబాబు, వై.క్రిష్ణమోహన్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ.లక్ష్మీఅక్షర రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారుపతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగే పోటీలలో పాల్గొంటుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే. అబ్దుల్‌సలాం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీఅక్షరను, కోచ్ అఖిల్‌ను డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కర్, బీ.నరేంద్రబాబులు బుధవారం అభినందించారు.

ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయి

లింగసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సీహెచ్‌వీఎల్ దుర్గ చెప్పారు. బుధవారం వీఆర్ కోట, అన్నెబోయినపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఏవైనా ఇబ్బందులుంటే సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పీఎం కిసాన్‌పై ఫిర్యాదులను సేకరించారు. వీఏఏ వినయ్, ఉద్యాన సహాయకులు హరికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 13న జగన్నాథ రథయాత్ర

● బ్రోచర్ ఆవిష్కరించిన ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి

కావలి(టౌన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యావత్ జీవకోటి అనుగ్రహం కోసమే జగన్నాథ రథయాత్ర అని ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రామ్మూర్తిపేటలో ఉన్న ఇస్కాన్ మందిరంలో రథయాత్రకు చెందిన బ్రోచర్లు, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. అనంతం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న కావలి పట్టణంలో జరగనున్న రథయాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రజల్లో దైవభక్తి తగ్గిపోతుందని, మన భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవర్చేందుకు జగన్నాథ రథయాత్ర దోహదపడుతుందన్నారు. ఎంతో దూరంలోని ఒడిశా రాష్ట్రం పూరీలో వెలసివున్న జగన్నాథుడి రథయాత్రలో పాల్గొనలేని భక్తులు డిసెంబరు 13న కావలిలో జరిగే యాత్రలో పాల్గొంటే పుణ్యఫలం దక్కుతుందన్నారు. దేశం నలుమూలల నుంచి ఇస్కాన్ ప్రముఖులు హాజరౌతారని, స్థానికుల సహకారంతో ఈ యాత్ర జరుతుందన్నారు. సమావేశంలో ఇస్కాన్‌కు చెందిన చంద్రశేఖర్ దాస్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి


నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పతాప్‌కుమార్ రెడ్డి

కావలి(టౌన్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆర్‌ఎస్‌ఆర్ మండపం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ట్రంకురోడ్డు మీదుగా బ్రిడ్జి కూడలి వరకు సాగి తిరిగి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది. అక్కడ ప్రతాప్‌కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా మెడికల్ విద్య అందించాలన్న దృక్పథంతో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు తన తొత్తులకు వాటిని కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన ఈ జీవోను తక్షణం రద్దు చేసి మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ధనుంజయ రెడ్డి, నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, కుందుర్తి కామయ్య, వేమిరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, గయాజ్, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న బుర్రా మధుసూదన్ యాదవ్, తదితరులు

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా బుధవారం కందుకూరులో నిరసన ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ నియోజకవర్గ ఇంఛార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పేరుతో తమ వర్గీయులకు అమ్ముకునేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కుట్రచేస్తున్నదని విమర్శించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే పేదలకు ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు కూడా సక్రమంగా అందవని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కందుకూరులో ఎమ్మెల్యే కార్యాలయం అవినీతిమయంగా మారిందని, ఇసుక, మట్టి రవాణా మొదలు కల్తీమద్యం, పేకాట శిబిరాల ద్వారా దండుకుంటున్నారని, పేదల బియ్యాన్ని బహిరంగంగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలోను పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని మొత్తం వ్యవహారాలను త్వరలోనే బయటపెడతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ రఫి, ఈదర రమేష్, నలమోతు చంద్రమౌళి, నున్నం పోతురాజు, అనుమోలు లక్ష్మీనరసింహం, నోటి వెంకటేశ్వరరెడ్డి, గణేశం గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ మేనేజర్లు, కాలేజీ కరస్పాండెంట్

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 30 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ తెలిపారు. మూడు దశల కఠినమైన ఎంపిక ప్రక్రియను తమ విద్యార్థులు సమర్థవంతంగా అధిగమించి ఉద్యోగాలకు ఎంపిక వడం నాణ్యమైన బోధనకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవికుమార్, అకడమిక్ ఇంచార్జి మీరావలి, అధ్యాపకులు విక్రమ్, సహిత్య, సుమలత, భరద్వాజ్‌లు అభినందించారు.

కమీషన్ల పేరుతో పేదల సొమ్ము దోచేశారు

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆగ్రహం ● బుడంగుంటలో ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ


లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కమీషన్లకు కక్కుర్తి పడి ఊరికి దూరంగా కాలుతో తంతే కిందపడే ఇళ్లు కట్టించి పేదల సొమ్ము దోచేశారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి అవాస్‌యోజన (అర్బన్) 2.0 పథకంలో భాగంగా మున్సిపాల్టీ పరిధిలో 342 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను బుధవారం బుడంగుంట గిరిజన కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కమీషన్ల కోసమే నివాసానికి పనికిరాని జగనన్న కాలనీలు కట్టి పేదల ఉసురు మూటకట్టుకున్నారన్నారు. అవి పనికి రాకుండా పోవడమే కాక ఆ లబ్ధిదారులకు మరో 20 ఏళ్ల వరకు కొత్త ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం లేకుండా చేశారన్నారు. గతంలో బుడంగుంట, మద్దూరుపాడు, ముసునూరు కావలి మున్సిపాల్టీలో కలిపినప్పుడు వాటికి మంచినీటి సరఫరా కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృత్‌పథకంలో భాగంగా రూ.53 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పైపులైన్లు వేయకుండా, కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా ఆ సొమ్ము స్వాహా చేశారన్నారు. దీంతో ఇప్పుడు పేదలకు కుళాయి కనెక్షన్‌లు ఇద్దామంటే రికార్డుల్లో ఇచ్చినట్లు చూపిస్తుందన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లు, వసతులకు సంబంధించిన నిధులు దోచేసిన పాపం ఊరికే పోదన్నారు. 2.0 పథకంలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,50,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,00,000 మంజూరు చేస్తుందన్నారు. ఎస్సీలు, బీవర్షలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.50 వేలు, గిరిజనలుకు రూ.75 వేలు ఇస్తుందన్నారు. లబ్ధిదారులు పునాదులు వేసుకున్న తర్వాత తాను తన సొంత నిధులు రూ.5,000 ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావన్‌కుమార్, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన జన్మదిన వేడుకలను బుడంగుంట కాలనీలో పేదల మధ్య జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి పేదలకు పంచి పెట్టారు.

30 రోజుల్లో పరిష్కరించాలి : ఆర్డీవో


రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కలిగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై వచ్చిన అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించాలని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ భూ సమస్యలపై 80 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కోర్టు కేసులు మినహా మిగిలిన భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా సిబ్బందితో పని చేయించాలని తహసీల్దారు గిరీష్‌కు సూచించారు. అయితే రెవెన్యూ సదస్సు జరిగే విషయం తమ గ్రామాల్లో సమాచారం ఇవ్వనందున ఉదయం రాలేకపోయామని, వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తెలిపారు. సాయంత్రం వేళ భూ సమస్యలతో కార్యాలయానికి వెళితే తమ అర్జీలను సిబ్బంది స్వీకరించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వరి పైరుకు ఆరుతడులుగా నీరు పెట్టాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏవో అబ్దుల్ రహీం

కందుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరిపైరు పొట్టదశకు వచ్చేవరకు ఆరుతడులుగా నీరు పెట్టాలని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రహీం తెలిపారు. మండలంలోని ఓగూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వరిపైరును పరిశీలించారు. వరిలో యూరియా అధికంగా వాడితే అగ్గితెగులు సోకి రైతులు నష్టపోతారని, పైరు పిలకదశలో, ఎదిగేదశలో నీరు తక్కువగా ఆరుతడులు ఇస్తే ఎక్కువ పిలకలు వచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సుస్మిత, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ఆదినారాయణరెడ్డి


కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి అని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం ఆదినారాయణరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ రక్తం ఇవ్వాలంటే భయపడే రోజుల్లో ఆదినారాయణరెడ్డి 52 పర్యాయాలు రక్తదానం చేశారన్నారు. చెన్నైలోని పలు బ్లడ్ బ్యాంకులలో ఆదినారాయణరెడ్డి ఫొటో ఉండేదన్నారు. ఆయన ఎన్ని పర్యాయాలు రక్తదానం చేసినా సాటి మనిషిని కాపాడటానికి రక్తదానం చేయటం కనీస బాధ్యత అని మిత్రులతో చెప్పే వారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ కలికి శ్రీహరిరెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కార్యదర్శి బీఎస్ ప్రసాద్, సభ్యులు గాదంశెట్టి హరనాథ్, మురళీక్రిష్ణ, సురేంద్ర, ఎం.రమణయ్య పాల్గొన్నారు.



నమ్మండి.. ఇది వాగేనండి !

ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులు నిండుకుండల్లా మారాయి. వరదనీరు వాగుల ద్వారా లోతట్టు ప్రాంతాలకు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో గండిపాళెం జలాశయం కింది భాగంలోని వాగు నామరూపాలు లేకుండా కంపచెట్లు, జమ్ముతో నిండి అడవిని తలపిస్తోంది. ప్రధాన రహదారిలోని ఆర్‌అంబ్‌బీ వంతెన వద్ద ఉన్న పిల్లాపేరు వాగు మీదుగా ప్రతినిత్యం ప్రయాణాలు సాగించే అధికారులు, సిబ్బంది అటు వైపు చూడక పోవడం దారుణం.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కలెక్టర్ హిమాన్షు వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు గ్రం థాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం ఆయన సంబంధిత అధికారు లతో కలిసి వారోత్సవాల పోస్ట ర్లు ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, మహిళా దినోత్సవం, వివిధ విజ్ఞానదాయక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



మనిషి పడుకున్నట్లే..!

ఉదయగిరి కొండను చూస్తే.. మనిషి పడుకున్నట్లుగా అనిపిస్తోంది. తిరుపతి కొండను పోలినట్లు ఉండే ఈ కొండను పట్ట ణం నుంచి పరిశీలిస్తే.. ఓ భారీ మనిషి నిద్రిస్తున్నట్లు అగుపిస్తుంది. ఈ చిత్రంలో ఎడమ వైపు పైభాగం నుంచి ముక్కు, పెదవి, నోరు, గడ్డం, గొంతుతోపాటు ఉదర భాగం ఎత్తుగా ఉంటుంది. పట్టణానికి వచ్చే ప్రజలు, పర్యాటకులకు ఈ దుర్గం ఆకృతి ఆకర్షణగా నిలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ఆక్వా రైతులకు లైసెన్స్ తప్పనిసరి

● గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి : నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆక్వా రైతులు విద్యుత్ రాయితీ పొందేందుకు తప్పనిసరిగా ఆక్వా సాగుకు లైసెన్సు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో అనూష స్పష్టం చేశారు. బుధవారం ఆమె కార్యాలయంలో మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులతో ఆక్వా లైసెన్సులపై కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు అందించే రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది రైతులు లైసెన్సు పొందారన్న వివరాలను తెలుసుకున్నారు. మిగిలిన వారు సమీప గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

ముగిసిన సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడలు

నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండురోజులుగా జరుగుతున్న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే పురుష, మహిళ ఉద్యోగులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి రోజు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, లాన్ టెన్నిస్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా బుధవారం స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీ బాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగ, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. డీఎస్‌డీవో పాండురంగారావు, కోచ్‌లు పర్యవేక్షించారు.

న్యుమోనియాపై ప్రజలకు అవగాహన

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యుమోనియా వ్యాధిపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు వచ్చేలా కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. బుధవారం ఆమె చాంబర్‌లో న్యుమోనియా వ్యతిరేక పోస్టర్లు విడుదల చేశారు. న్యుమోనియాను అరికట్టటం ద్వారా పిల్లల మరణాలను తగ్గించ వచ్చన్నారు. న్యుమోనియా రక్తంలో ఆక్సిజన్ శాతాన్ని తగ్గిస్తుందని తెలిపారు. చిన్నపిల్లలకు బీసీజీ, పెర్టుసస్ టీకాలతోపాటు న్యుమోనియా వాక్సిన్ ఇవ్వటం వల్ల చిన్నారులలో ఈ వ్యాధిని జయించ వచ్చని తెలిపారు. న్యుమోనియా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామని, ఇది వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, ఎస్సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, డెమో కనకరత్నం, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ భాస్కర్, డీపీవో రమేష్, జ్యోతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

వృద్ధురాలిపై దాడి, దోపిడీ

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వృద్ధురాలిపై కొం దరు దుండగులు దాడి చేసి ఆమె మెడలోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సేకరించిన సమాచారం మేరకు... హౌసింగ్ బోర్డు కా లనీలోని ఎంఐజీ ఇళ్లలో కేసరి రుక్మిణమ్మ (73) ఒంటరిగా జీవిస్తున్నారు. ఆమె తమ్ముడు శ్రీనివాసులు అదే ప్రాంతంలో మరో చోట ఉంటున్నారు. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు అక్కతో ఉన్న ఆయన ఆ తర్వాత తన ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం రుక్మిణమ్మ ఇంటి గేటు వేస్తుండగా ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆ మెపై దాడి చేసి కొట్టారు. ఆమె ఒంటిపై ఉన్న 12 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గాయపడిన వృద్ధురాలిని గుర్తించిన చుట్టుపక్కల వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై త మకు సమాచారం అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు.

బత్తులపల్లిలో ఘర్షణ

పొదలకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బత్తులపల్లికి చెందిన వైసీపీ నాయకులు ఆనంద్ రెడ్డి, అశోక్‌రెడ్డిలు, వారికి సంబంధించిన సిమెంటు, ఇనుప కమ్ములను గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో నిల్వ ఉంచారు. ఇటీవల సచివాలయానికి యూరియా రావడంతో అందులో నిల్వ ఉంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేశారు. దీంతో సిమెంటు, ఇనుప కమ్ములను ఖాళీ చేయమని కోరగా వారు ఖాళీ చేసే సమయంలో ఈ బడికి గేటు కూడా తామే పెట్టించామని, వీటితో పాటు బడికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. దీంతో అక్కడ ఘర్షణ నెలకొంది. టీడీపీ నాయకుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనీఫ్ తెలిపారు.

16న కార్తీక మాస మహారుద్రాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 7గంటల నుంచి స్థానిక సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ దేవస్థానంలో మహారుద్రాభిషేకం జరుగుతుందని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుడ్లదొన వాసుదేవరావు, దుద్దుకూరు రమేష్ తెలిపారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహారుద్రాభిషేకం అనంతరం 108 మంది బ్రాహ్మణ దంపతులకు సామూహిక షష్టిపూర్తి, భీమరథ శాంతి, శివకేశవుల కల్యాణం, బ్రాహ్మణ వన సమారాధన జరుగుతాయని, బ్రాహ్మణ సంఘీయులందరూ తరలిరావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నారాయణరావు, శ్రీధర్‌శర్మ, గడ్డం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తపుటేరులు!

జిల్లాలో రహదారులు రక్తం రుచి మరిగాయి. ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఇటీవల సంగం మండలం పెరమన వద్ద ముంబయి హైవేపై జరిగిన ప్రాంతంలో ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. అది మరవక ముందే మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం ప్రతి ఒక్కరినీ భయభ్రాంతులకు గురి చేసింది. ఇలా నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడకపోవడంతో ఎన్నో కుటుంబాల్లో విషాదఛాయలు అలుముంటున్నాయి.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

ఏటా ప్రమాదాలు ఇలా ...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	943	398	944
2021	977	466	1006
2022	884	368	974
2023	828	450	905
2024	663	384	645

● భయం భయంగా హైవేలపై ప్రయాణం

● ఇష్టానుసారంగా ఫుడ్‌కోర్టులు, దాబాలు, చిరువ్యాపారాలు

● ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్

● ఆపై మద్యం, నిద్రమత్తు, విశ్రాంతిలేమితో డ్రైవింగ్

● జిల్లా రహదారి భద్రతా మండలి ఏం చేస్తున్నట్లు!?

● బ్లాక్‌స్పాట్‌లను గుర్తించినా ప్రమాదాల నియంత్రణ ఏదీ?

● ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం

● శోకసంద్రంలో మునిగిపోతున్న కుటుంబాలెన్నో!



నెల్లూరు : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కనే ఆపి ఉన్న లారీలు

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతి వేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనం నడపడంతోపాటు రోడ్డు పక్కన ఇష్టానుసారంగా వాహనాలు ఆపడం. జాతీయ రహదారుల వెంబడి ఫుడ్ కోర్టులు, దాబాలు, బార్లు, మద్యం దుకాణాలు పెరిగాయి. దీనికితోడు రోడ్ల పక్కనే చిన్నపాటి బండ్లు, షెల్టర్‌లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతుండటం ద్వారా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఎప్పటికప్పుడు వీటిని గుర్తించి, నిలువరించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రం హడావుడి చేయడం, మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లామీదుగా వెళుతున్న జాతీయ రహదారులపై వాహనదారుల కోసం రెస్ట్ ఏరియా'లు ఉన్నాయి. ఇక్కడ వాహనాలు ఆపి విశ్రాంతి తీసుకోవడం, వాహనాలను మరమ్మతు చేసుకోవడం వంటివి చేయచ్చు. కానీ ఈ ప్రాంతాల్లో వాహనాలను ఆపడం లేదు.

● అనుభవం లేకుండా..

కరోనా తర్వాత అవసరాల రీత్యా ఇంటికో కారు అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి తక్కువ డౌన్ పేమెంట్‌తో కార్లు డెలివరీ ఇచ్చేస్తున్నారు. వివిధ అవసరాలు, కార్యాలకు వెళ్లాలంటే సొంతకార్లు, బంధువుల వద్ద ఉండే కార్లను వాడుతున్నారు. అయితే, అనుభవజ్ఞులు కాకుండా కాస్తోకూస్తో డ్రైవింగ్ వచ్చిన వాళ్లు వాహనాలను రోడ్లపైకి తీసుకువస్తున్నారు. దీంతో వేగం నియంత్రించలేక, రద్దీలో వాహనం నడిపే నైపుణ్యం లేకుండా, అధిక సమయం నిద్ర మేల్కొని వాహనాలు నడపలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

● బ్లాక్ స్పాట్‌లపై కానరాని దృష్టి

గడిచిన మూడేళ్లలో ముగ్గురు కంటే ఎక్కువగా ఒకే ప్రాంతంలో ప్రమాదంలో మరణించి ఉంటే ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఈ బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాల నివారణతోపాటు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లా రహదారి భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేసుకొని చైర్మన్ కలెక్టర్, వైస్ చైర్మన్ ఎస్పీ, కన్వీనర్‌లతోపాటు సభ్యులు పాల్గొని నివారణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే, తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో మాత్రం అధికారులు చేతులెత్తేస్తున్నారు. వాహనాల స్పీడ్‌ను తగ్గించలేక పోవడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపు చేయడం, రోడ్డు పక్కన ఇష్టానుసారం పార్కింగ్‌ను నిలువరించక పోవడం, బ్లాక్ స్పాట్‌లలో నిరంతరం పోలీసు సిబ్బంది ఉండక పోవడం ఇలా అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించక పోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతూ ఉంది. ప్రధానంగా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పూర్తిగా లోపించింది. జాతీయ రహదారిపై విధులు నిర్వహించే పోలీసులు చెట్ల నీడన విశ్రాంతి తీసుకోవడం, హైవేపై ఉన్న దాబాలు, దుకాణాల వద్ద నెల మామూళ్లు తీసుకుంటూ రోడ్డుపక్కన ఆపే వాహనాలను కనీసం హెచ్చరించడం లేదన్న విమర్శలున్నాయి. రవాణా శాఖాధికారులు కొన్ని పాయింట్లకే పరిమితం అవుతూ చలానాలు, మామూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సమావేశాలకే పరిమితం కాకుండా రహదారులపై నిత్యం తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆ మార్గమే కారణమా!?



జాతీయ రహదారిపై గ్రీన్‌సిటీ వైపు తెరిచి ఉన్న మార్గం

నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం సంచలనంగా మారింది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం పరిశీలిస్తే జాతీయ రహదారిపై అటు ఇటుగా వెళ్లే మార్గమని స్పష్టమవుతుంది. కొన్ని నెలల క్రితం నగరంలోని గ్రీన్‌సిటీ నుంచి ఎన్టీఆర్ నగర్ వైపు వెళ్లే జాతీయరహదారిని పూర్తిగా మూసివేశారు. అయి తే కొద్ది రోజుల క్రితం ఈ మార్గాన్ని తెరిచారు. దీని వెనుక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే గ్రీన్‌సిటీ నుంచి ఎన్టీ ఆర్‌నగర్ వైపు బైక్‌పై వస్తున్న ఓ యువకుడు యూటర్న్ తీసుకునే క్రమంలో వెనుక వస్తున్న వా హనాన్ని గమనించక పోవడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, నలుగురు గాయాలపాలయ్యారు. హైవేపై ఆ మార్గం తెరవక పోతే ఈ ప్రమాదమే జరిగేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, బుధవారం రాత్రి ఈ మార్గాన్ని అధికారులు మూసివేశారు.

● పరారీలో మినీ కంటైనర్ డ్రైవర్

ఎన్టీఆర్ నగర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన మినీకంటైనర్ డ్రైవర్ శ్రావణ్‌కుమార్ యాదవ్ పరారీలో ఉన్నాడు. ఆ ప్రమాదంలో గాయాలపాలైన నలుగురిలో ముగ్గురు కోలుకుంటుండగా, లైన్‌మన్ అనీల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. 24 గంటలు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమని వైద్యులు చెప్పినట్టు సమాచారం.

● క్షతగాత్రులకు ఉచిత వైద్యం

నెల్లూరు (వైద్యం) : నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులకు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ఆ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా మేనేజర్ వెంకటమురళితో కలిసి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలపై జిల్లా జడ్జి సమావేశం

ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పలుశాఖల అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జిల్లాలో రోజూ జరుగుతున్న యాక్సిడెంట్ కేసులు, ట్రాఫిక్, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ఇలా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి కే వాణి, మున్సిపల్ కమిషనర్ నందన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కనకాద్రి, ఇన్‌చార్జ్ ట్రాఫిక్ డీఎస్పీ గిరిధర్, ఇన్‌చార్జ్ ఆర్టీవో బాలమురళీకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

మాయా పెట్టెతో పాఠాలు

● పాఠశాలలకు చేరిన 658 నైపుణ్య కిట్లు

● ఒక్కో కిట్‌లో 62 ఆట వస్తువులు





నెల్లూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు ఆటల ద్వారా పాఠాలు బోధించేలా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారిలో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు 'జాదూయి పిటారా'(మాయా పెట్టె) కిట్లు అందచేస్తోంది. సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలను పెంచి చిన్నారులకు అభ్యసనాన్ని ఆనందదాయకంగా చేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. బొమ్మలు, పజిల్స్, కథలు, ఫ్లాష్‌కార్డులు, తోలుబొమ్మలతో ఆడుకుంటూ అక్షరాలు, అంకెలు, రంగులు, ఆకారాలను నేర్చుకునేలా తరగతులు నిర్వహించనున్నారు.

● విజయవంతం చేస్తాం..

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని పాఠశాలల్లో అమలు చేస్తోంది. జాతీయ విద్యావిధానంలో సూచించిన ఫౌండేషన్ స్టేజ్ పిల్లల కోసం రూపొందించబడిన ఈ కార్యక్రమం విజయవంతం చేస్తామని అధికారులు చెపుతున్నారు. చిన్నారులు విద్యలో పుస్తకాల కంటే అనుభవం, ఆటలు, కథలు, పాటలు, చిత్రాలు ద్వారా నేర్చుకోవడం ఎంతో ఫలప్రదమని భావించి ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది.

● జిల్లాకు 658 కిట్‌లు

జిల్లాలోని 658 పాఠశాలలకు ఒక్క కిట్ చొప్పున మంజూరు కాగా, ఒక్కో దానిలో 62 రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. వీటిలో రంగుల బొమ్మలు, బోధనోపకరణాలు, అంకెలు, అక్షరాలు, రంగుల పెన్సిళ్లు, తెలుగు, ఆంగ్ల భాషలతో కూడిన అక్షరాలు, గణిత అంశాలను సులువుగా గుర్తించడానికి ఆకారాలను అందుబాటులో ఉంచారు. వీటిని అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా ఒకటి, రెండు తరగతులున్న పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకటి లేదా రెండు కిట్లు అందిస్తున్నారు.

నైపుణ్యాలను పెంచేందుకే...

చిన్నారుల్లో విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా సామాజిక, భావోద్వేగ అభిజ్ఞాన సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఉపాధ్యాయులు ఈ కిట్‌ను సమర్థవంతంగా వినియోగించడం వల్ల విద్యార్థులు మెరుగైన అభ్యసనా ఫలితాలు సాధించేలా చేస్తాం.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష కోఆర్డినేటర్


ఇమామ్, మౌజన్ల వేతనాలకు రూ.90కోట్లు

● ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించిందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇమామ్, మౌజన్లకు నెలకు రూ.15వేలు చొప్పున గౌరవ వేతనాలు చెల్లించేందుకు, 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.90కోట్లు విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలతోపాటు 2025 జనవరి నుంచి సెప్టెంబరు వరకు గౌరవ వేతనాలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. సమాజంలో సద్భావన, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్న రాష్ట్రంలోని వేలాది ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇది ఎంతో ఉపశమనం కలిగించే చర్య అని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ప్రతి అర్హుడి చేతికి సకాలంలో చేరేలా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నారని, సమాజ అభివృద్ధి కోసం ప్రతి సామాజిక వర్గాన్ని సమానంగా చూసే నాయకుడు ఆయనని కొనియాడారు. చంద్రబాబు దూరదృష్టి, పరిపాలన నైపుణ్యం, అనుభవం వల్లే మైనార్టీల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జీజీహెచ్ ప్రాంగణంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాల (జీజీహెచ్) ప్రాంగణంలో బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల విచారించినా మృతుడు ఎవరనే వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700018 నెంబరుకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు కోరారు.



వృద్ధుడి మృతదేహం